## లోక్‌సత్తా పార్టీ

# జనరాజకీయం

డి.వి.వి.యస్.వర్మ

# ముందుమాట

## లోక్‌సత్తా పార్టీని సమాజ సంపదగా తీర్చిదిద్దాలి

పుట్టుకతో మనుషులందరూ సమానగౌరవానికి అర్హులు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భావం చాలా కృత్రిమమైనది, హేయమైనది; రాచరికంలోను, మధ్యయుగాల భూస్వామ్య సంస్కృతిలోను వ్యక్తి గౌరవాన్ని కాలరాచి, పుట్టుకతో అసమానతలని సృష్టించి, మనిషి ఆత్మవిశ్వాసాన్ని కించపరిచారు. మన దేశంలో దానికి తగ్గట్టు కులవ్యవస్థ ఈ అసమానతలని వ్యవస్థీకృతం చేసి జాతి అనైక్యతకి, పుట్టు బానిసత్వానికి, వివక్షకి, అన్యాయానికి దారితీసింది. మనుషులంతా సమానమేనని, ప్రతి వ్యక్తి తన మంచిని తాను తెలుసుకోగలడని, తమ జీవితానికి సమిష్టి జీవనానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే హక్కు అందరికీ ఉందనే విశ్వాసం ప్రజాస్వామ్యానికి ప్రాణం.

ప్రజాస్వామ్యంలో వయోజన ఓటుహక్కు, ప్రత్యక్ష ఎన్నికలు, ప్రాతినిధ్య పరిపాలన మౌలిక లక్షణాలు. పౌరుడే ప్రజాస్వామ్యంలో సార్వభౌముడు. అయితే కొన్ని పరిమితమయిన అంశాలలో మాత్రమే ఉమ్మడి సేవల అవసరం ఉన్న పౌరులు ప్రత్యక్షంగా తమంత తామే పాలనలో నిర్ణయాలు తీసుకోవటం సాధ్యం. మిగిలిన అంశాలలో పౌరులు ప్రత్యక్షంగా ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవటం ఆచరణ సాధ్యం కాదు. పరిమితమయిన వనరులని వివిధ రంగాలకి ప్రాధామ్యాల ప్రకారం కేటాయించటానికి, సమాజం దీర్ఘకాల లక్ష్యాల పై దృష్టిని సారించటానికి, వివిధ వర్గాల మధ్య వైరుధ్యాలని తొలగించి సమన్వయం చేయటానికి, అందరికీ సమన్యాయం చేయటానికి ప్రాతినిధ్య పాలన అవసరం. ఆ ప్రాతినిధ్య పాలనలో ప్రతినిధుల ఎంపిక కోసం ఎన్నికలు, ప్రజలలో బహిరంగ చర్చ, సమర్థ నాయకత్వాన్ని సృష్టించుకోవటం అవసరం. ఎన్నికలు, బహిరంగ చర్చ, నాయకత్వ సృష్టి ఈ మూడు ప్రక్రియల కోసం రాజకీయ పార్టీలు అవతరించాయి.

లోక్‌నాయక్ జె.పి లాంటివారు పార్టీరహిత ప్రజాస్వామ్యాన్ని ఆశించారు. సిద్ధాంతరీత్యా సబబయినా, చిన్న సమాజాలలోను, స్థానిక ప్రభుత్వాలలోను తప్ప ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల పాత్రని తగ్గించటం సాధ్యం కాదని రుజువయింది. అయితే ప్రజాస్వామ్యాన్ని క్రమబద్ధంగా నడపటం కోసం పౌరుల సార్వభౌమత్వానికి వేదికగా అవతరించిన పార్టీలే ఆధునిక జమిందారీలుగా, రాచరికాలుగా మారిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంది. ప్రజల భావాలకి దర్పణంగా నిలిచి, ఆరోగ్యకరమైన బహిరంగ చర్చని ప్రేరేపించి, జనాభిప్రాయాన్ని

మలిచి, అన్ని వర్గాలకి సమన్యాయం చేయవలసిన పార్టీలు కేవలం కొద్దిమంది పెత్తనం కోసం అర్రులు చాచి, ఆ ప్రజలకి కంటకప్రాయం అయితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలకే పరిమితమవుతుంది. ఎన్నిక కేవలం కొందరి ఆధిపత్యాన్ని నిర్ణయించే ప్రక్రియ అవుతుంది. పార్టీ కొందరి స్వంత ఆస్తిగా, కుటుంబ జాగీరుగా మారిపోతుంది. దీర్ఘకాలిక లక్ష్యాలు మరుగున పడి, అధికారం కోసం తాత్కాలిక ప్రలోభాలతో ప్రజలని మభ్యపెట్టటం ఆనవాయితీ అవుతుంది. అన్ని వర్గాల మధ్య సమన్వయం, దగా పడ్డ పౌరులకి ఎదిగే అవకాశాలు స్థానే పార్టీలు వివిధ వర్గాల మధ్య విద్వేషాలని, హింసని రెచ్చగొట్టి సమాజాన్ని కల్లోలం చేస్తాయి. మన దేశంలో పార్టీలలో ఈ పెడధోరణులన్నీ కనిపిస్తున్నాయి. అందుకే ఎన్నికలు జరుగుతున్నా స్వపరిపాలన, పౌరసార్వభౌమత్వం, చట్టబద్ధపాలన, స్వయందిద్దుబాటు కొరవడ్డాయి.

ఈ రుగ్మతలు లేకుండా పార్టీలు ప్రజల ఆస్తిగా తీర్చిదిద్దాలంటే గతంలో జరిగిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. సంస్థాగత ఏర్పాట్లలో ఎన్నో మెళుకువలని ప్రవేశపెట్టాలి. సభ్యులకి నిరంతరం శిక్షణ, స్పష్టమయిన అవగాహన కావాలి. పార్టీని సమాజ సంపదగా తీర్చిదిద్దాలి. జాతి ఐక్యతకి పార్టీ పునాది కావాలి.

అందుకే లోక్‌సత్తా పార్టీ నిర్మాణంలో, నిర్వహణలో తాత్వికపునాదులలో మూడు మౌలిక సూత్రాలున్నాయి. పుట్టుకతో వచ్చిన వివక్షని, అసమానతలని తొలగించటం రాజ్యవ్యవస్థ తొలి లక్ష్యంగా గుర్తించి, అందుకు తగినట్లుగా విధానాలని, పార్టీ నిర్మాణాన్ని రూపొందించటం తొలి సూత్రం. సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న విష సంస్కృతిని నాశనం చేయటం కోసం రాజ్యాంగం, రాజ్యవ్యవస్థ, చట్టం, విధానాలు, పాలన ఆయుధాలు కావాలి. రెండో సూత్రం, పార్టీ ప్రజల ఆస్తిగా, నిరంతరం స్వయందిద్దుబాటు ఉండేలా రూపొందాలి. కేవలం పార్టీ నాయకత్వమో, సభ్యులో, పార్టీకి స్వంతదారులయితే కాలక్రమేణా పార్టీ కొందరి స్వంత ప్రయోజనాలకి కేంద్రం అవుతుంది. ప్రజాస్వామ్య అవసరాలరీత్యా పుట్టిన పార్టీలు ఆ ప్రజాస్వామ్యాన్నే కాలరాచే తీరున పరిణామం చెందటం రాజ్యాంగానికే అపచారం. అందుకే పార్టీ నిర్వహణతో, నిధులలో, నాయకత్వం ఎంపికలో పారదర్శకత; పార్టీ కార్యకలాపాలలో ప్రజలకి జవాబుదారిగా ఉండటం కోసం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు (స్వతంత్ర ఆంబుడ్స్‌మన్ వ్యవస్థ); పార్టీ అభ్యర్థుల ఎంపికలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం అవసరం. మూడోది, దేశ ఐక్యత, జాతీయత లోక్‌సత్తా పార్టీకి ప్రాణం. సంక్లిష్టమయిన, వివిధ భాషలున్న పెద్ద సమాజంలో దేశమంతటా రాజకీయాన్ని ఒక్కసారిగా ప్రభావితం చేయటం ఆచరణ సాధ్యం కాదు కాబట్టి, నూతన రాజకీయ సంస్కృతిని తొలిదశలో ప్రవేశపెట్టటానికి, రాజకీయాన్ని, రాజ్య వ్యవస్థని ప్రక్షాళన చేయటానికి, నిశ్శబ్ద ప్రజాస్వామ్య

విప్లవాన్ని సాధించటానికి లోక్‌సత్తా పార్టీ మన రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకుంది. అయితే, మన రాష్ట్ర ప్రయోజనాలని కాపాడుకుంటూనే, మన ఉనికికి, రాజ్యాంగ పరిరక్షణకి, ఉమ్మడి ప్రయోజనాలకి, నిజమైన జాతీయత, ద్వేషాన్ని ప్రేరేపించని దేశభక్తి, జాతి ఐక్యత మూలస్తంభాలని గుర్తించటం అవసరం. పుట్టుకతో వివక్షపై రాజీలేని పోరాటం; అంతర్గత ప్రజాస్వామ్యంతో పాటు పారదర్శకత, ప్రాథమిక ఎన్నికలు; జాతీయత  ఈ మూడు మౌలిక సూత్రాలు లోక్‌సత్తా పార్టీకి ఆయువుపట్టులు.

పార్టీ సభ్యులందరూ ఈ అవగాహన పెంచుకోవటం, రాజకీయాన్ని ఈ మూడు కోణాల నుండి విశ్లేషించటం; జాతి ప్రయోజనాల కోసం పార్టీని వేదికగా చేసుకోవటం; రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం, రాజకీయాన్ని మలచటం; ప్రతిపౌరుడి శక్తి సామర్థ్యాలు వెలికితీయటం; నివారించదగ్గ క్లేశాన్ని తొలగించటం నూతన రాజకీయ సంస్కృతిని మనసా, వాచా, కర్మణా అనుసరించటం నేటి అవసరం.

లోక్‌సత్తా ఉద్యమ నిర్వహణలో, నూతన రాజకీయ సంస్కృతిని నిర్వచించటంలో, లోక్‌సత్తా పార్టీ స్థాపనలో, పార్టీ నిర్మాణంలో, నమ్మిన సిద్ధాంతాల కనుగుణంగా పార్టీ విధానాలని, కార్యక్రమాలని రూపొందించటంలో శ్రీ డి.వి.వి.యస్. వర్మగారికి అత్యంత కీలకమయిన పాత్ర ఉంది. ఈ పుస్తకాన్ని వర్మగారు అత్యంత శ్రద్ధతో, నిబద్ధతతో రచించారు. వర్మగారి జీవితానుభవం, రాజకీయపరిణతి ఈ పుస్తకం లో ప్రతి వాక్యంలోను కనిపిస్తాయి. సరళమయిన భాషలో, సులభశైలిలో సంక్లిష్టమయిన అంశాలని తేలికగా అర్థమయ్యేలా వర్మగారు ఈ పుస్తకంలో అందరికీ అందించారు. పార్టీ నిర్మాణానికి, సభ్యుల శిక్షణకి, మన లక్ష్యాలకి తగిన కార్యక్రమాలు చేపట్టటానికి వర్మగారు నిరంతరం చేస్తున్న కృషికి మనమంతా రుణపడి ఉన్నాం.

ఈ కరదీపిక పార్టీ సభ్యులని, నాయకులని చైతన్యులని చేస్తుందని, జాతి లక్ష్యాల కోసం, స్వతంత్ర ఫలాలు అందక తపిస్తున్న బాధాసర్ప ద్రష్టుల కోసం, భావితరాల కోసం పోరాడేందుకు మనకి స్ఫూర్తినిస్తుందని మనసారా విశ్వసిస్తున్నాను.

హైదరాబాద్,

19-6-2007

**భవదీయులు**

**(జయప్రకాష్ నారాయణ్)**

# 1. లోక్‌సత్తా జనరాజకీయం

## ప్రశ్న : రాజకీయం ఎందుకోసం? ఎవరికోసం?

**వివరణ :** రాజకీయం ఎందుకు అన్న ప్రశ్న మనం వేసుకోవాలి. సరైన అర్థాన్ని మనం తెలుసుకోవాలి. ప్రజలు తమంతట తాము చేసుకోలేని పనులను చక్కబెట్టేది రాజకీయం. సమాజంలో వివిధ తరగతుల వారుంటారు; వారిమధ్య అంతరాలు, వ్యత్యాసాలు వుంటాయి. ఈ అంతరాలను అధిగమించి సామరస్యాన్ని, అభివృద్ధిలో సమతూకాన్ని సాధించేది రాజకీయం. సమాజంలో వనరులు ఎప్పుడూ పరిమితంగా వుంటాయి. ప్రజల అవసరాలు అపరిమితంగా వుంటాయి. ఈ రెండింటికీ మధ్య వారధి కట్టేది రాజకీయం. ప్రజలు తమంతట తాము సమకూర్చుకోలేని విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన పరిష్కారాలను కనుగొనేది రాజకీయం. ప్రజల ఆకాంక్షలకు ఒక రూపం ఇచ్చి, దానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ప్రజల్ని లక్ష్యసాధన వైపు నడిపించేది రాజకీయం. సమాజహితం కోసం ప్రభుత్వాల ఏర్పాటుకు, నిర్వహణకు ప్రజల్ని సమీకరించేది రాజకీయం.

రాజకీయం కేవలం అధికార క్రీడ మాత్రమే కాదు. దానికి అధికారం ఒక సాధనం మాత్రమే. రాజకీయం పరిధి అంతకంటే విస్తృతమైంది, విశాలమైంది. ప్రజల దైనందిన జీవితంలో రాజకీయం స్పృశించని రంగం అంటూ ఏదీ వుండదు. సమాజహితం కోసం చేసే ప్రతి కార్యకలాపం రాజకీయమే. గ్రామం కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం చేసే ప్రతి పనీ రాజకీయమే. అందుకే రాజకీయం ఒక పవిత్ర సామాజిక వ్యాసంగం.

రాజకీయం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకి, పార్టీలకి, వారి కార్యకర్తలకి మాత్రమే కాదు, ప్రజలందరికీ అవసరం. ప్రజలు ఓటు ద్వారా తమ అధికారాన్ని, పన్నుల ద్వారా తమ సొమ్మునీ ఎవరి చేతుల్లో పెట్టాలో నిర్ణయించుకోవడం రాజకీయం. తమ పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యం, తమ గ్రామాభివృద్ధి ఎవరు ఎలా మెరుగు పరుస్తారో తెలుసుకోవడం రాజకీయం. అందువల్ల రాజకీయం మనందరి అవసరం. ప్రజాస్వామ్యం మనుగడకి, సుపరిపాలనకి సమాజహితాన్ని కోరే మంచి రాజకీయం అవసరం.

## ప్రశ్న : ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభువులు, పాలకులు సేవకులేనా?

**వివరణ :** ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభువులు. పేదలైనా, సంపన్నులైనా అందరికీ ఒకే ఓటు ఉంది. ప్రజలు ఓటువేసి గెలిపిస్తేనే వారికి అధికారం వస్తుంది. ఎవరికి అధికారం ఇవ్వాలన్నది ప్రజల చేతుల్లో ఉంది. అలాగే ఈ దేశంలో పేదలు, సంపన్నులు అంతా పన్నులు కడుతున్నారు.

ఒక వ్యవసాయ కూలీ రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని వంద రూపాయలు సంపాదించి ఉప్పుకీ, పప్పుకీ, నూనెకీ, సబ్బుకీ ఖర్చుపెడితే అందులో 10 నుండి 15 రూపాయలు పన్నుగా ప్రభుత్వాలు తీసుకుంటాయి. ఈ పన్నుల డబ్బునే ప్రభుత్వాలు ఖర్చుపెడతాయి. ప్రజాప్రతినిధులకయ్యే ఖర్చు, అధికారుల జీతభత్యాలు అన్నీ ప్రజల డబ్బుతోనే, ప్రజలు చెల్లించే పన్ను డబ్బుతోనే. ఈ అధికారం ప్రజలది. ఈ సొమ్ము ప్రజలది. గెలిచిన పార్టీలదీ కాదు, నడిపించే అధికారులదీ కాదు. ప్రజలసొమ్మునే వీరు ఖర్చు చేస్తున్నారు. జీతభత్యాలు పొందుతున్నారు. ప్రజలు ప్రభువులు. పాలకులు సేవకులు మాత్రమే.

**మన సొమ్ము మన కోసం ఖర్చు కావాలి :** సాలీనా దేశంలో 10 లక్షల కోట్ల రూపాయలను జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుపెడుతున్నాయి. అంటే మూడు వేల జనాభా ఉన్న గ్రామ ప్రజల పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు సంవత్సరానికి మూడు కోట్ల రూపాయలు. ఐదు సంవత్సరాలలో చేస్తున్న ఖర్చు 15 కోట్ల రూపాయలు.

దేశంలో ప్రతి మనిషి పేరు మీద సంవత్సరానికి చేస్తున్న ఖర్చు 10వేల రూపాయలు. ప్రతి కుటుంబం పేరు మీద సంవత్సరానికి చేస్తున్న ఖర్చు 50 వేల రూపాయలు, 5 సంవత్సరాలలో చేస్తున్న ఖర్చు 2 లక్షల 50 వేల రూపాయలు. ప్రతిరోజూ ప్రతి కుటుంబం పేరుమీద 150 రూపాయలు దేశంలో ఖర్చు అవుతుంది.

ప్రజల పన్నుల డబ్బులో కొంత ఢిల్లీలో దేశం కోసం, కొంత హైదరాబాద్‌లో రాష్ట్రం కోసం ఖర్చు కావాలి. కాని ప్రజల డబ్బు ముఖ్యంగా వారి అవసరాల కోసం, వారి కళ్లముందు ఖర్చుకావాలి. మనం నివసించే గ్రామంలో, పట్టణంలో ప్రజల అవసరాలకోసం ఖర్చు కావాలి. రక్షిత మంచినీటి కోసం, బహిరంగ మలవిసర్జన లేకుండా చేసే మరుగుదొడ్ల కోసం, ఈగలు, దోమలు లేని పారిశుధ్యం కోసం ఖర్చు కావాలి. మన పిల్లలకు మంచి చదువు, అందరికీ ఆరోగ్యం అందించడానికి ఖర్చు కావాలి. వ్యవసాయానికి, పేదల సంక్షేమానికి, యువత ఉపాధికి, మహిళల అభ్యుదయానికి ఖర్చు కావాలి.

ఈ డబ్బు ఏమౌతున్నది? ఎక్కడ ఖర్చు అవుతున్నది? మన దేశంలో ప్రతి సంవత్సరం 1లక్షా 50వేల కోట్ల రూపాయలు అవినీతిపరులు భోం చేస్తున్నారు. నిజంగా ప్రజల సొమ్ము అవినీతిపరం కాకుండా ప్రజల కోసం ఖర్చయితే మన జీవితాలు మారి పోతాయి. అది చెయ్యడమే మంచి రాజకీయం.

ఓటు కొనేవారు ఎన్నికల్లో 200 రూపాయలు ఒక మందుసీసా ఇచ్చి, ప్రతి కుటుంబంపై ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న 2లక్షల50వేల రూపాయల మీద పెత్తనం పొందుతున్నారు. వారు ఓటుకోసం ఇచ్చేది పుచ్చుకున్నవారికి ఒకరోజు సరదా ఖర్చుకు సరిపోతుంది. ఓట్లు కొన్నవాళ్ళు

ఆ కుటుంబం పేరుతో ఖర్చు అవుతున్న సొమ్ములో వేల రూపాయలు దండుకుంటున్నారు. ప్రజలసొమ్ము ప్రతి పైసా తమ గ్రామం కోసం, తమ కోసం, తమ పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు చేసే కొత్త రాజకీయం కావాలి.

## ప్రశ్న : ప్రజల్ని ప్రభువుల్ని చేయడం ఎలా?

**వివరణ:** ప్రజల్ని ప్రభువుల్ని చేయాలంటే ప్రజల భాగస్వామ్యాధికారం గల మంచి ప్రజాస్వామ్యాన్ని మనం సాధించాలి. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు జరగడం, కొన్ని స్వేచ్ఛలు ఉండడం మాత్రమే కాదు. నిజమైన ప్రజాస్వామ్యంలో ఐదు మౌలిక అంశాలు ఉండాలి.

ఎ) **స్వేచ్ఛ :** వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. భావప్రకటన హక్కు, ఎక్కడైనా నివశించే హక్కు, సంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ అన్నీ ఇందులో అంతర్భాగాలు. ఈ అంశంలో మన ప్రజాస్వామ్యానికి 60,70 శాతం మార్కులు వస్తాయి.

బి) **స్వయంపాలన :** పౌరులు తమనితాము ప్రత్యక్షంగా లేదా పరోక్షప్రాతినిధ్య పద్ధతిలో పాలించుకునే హక్కు మన ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉంది. ఎన్నికల్లో డబ్బు, కండబలం ప్రధాన పాత్రధారులయ్యాయి. ప్రజలు కేవలం ఓటర్లుగా మిగిలిపోతున్నారు. స్వయంపాలనకు 25 శాతం మార్కులు వస్తాయి.

సి) **ప్రజల భాగస్వామ్యాధికారం :** పాలనలో పౌరులకు నిరంతర భాగస్వామ్యం ఉండాలి. కేంద్రీకృతపాలన వల్ల పౌరుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరుగుతున్నాయి. ఈ అంశంలో 10 శాతం మార్కులు వస్తాయి.

డి) **చట్టబద్ధపాలన :** ఎంతటి సంపన్నులైనా, ప్రజాప్రతినిధులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. ప్రస్తుతం డబ్బు, అధికారం ఉన్నవాడికో న్యాయం లేనివాడికో న్యాయం సాగిపోతున్నది. ఈ అంశానికి 5 శాతం మార్కులు వస్తాయి.

ఇ) **స్వయందిద్దుబాటు :** రాజ్య వ్యవస్థలో స్వయందిద్దుబాటుకీ, స్వయంపరివర్తనకీ తగిన వ్యవస్థలు ఉండాలి. మన పాలనా వ్యవస్థ స్వయం పరివర్తనా శక్తిని కోల్పోయింది. ఈ అంశానికి 10 శాతం మార్కులు వస్తాయి.

మొత్తం మీద ప్రజాస్వామ్య ఫలితాలను ప్రజలకు అందించాల్సిన వ్యవస్థలు పూర్తిస్థాయిలో పనిచెయ్యడం లేదు. వీటిని చక్కదిద్దడానికి జనరాజకీయం కావాలి.

**పౌరులు కేంద్రంగా వికేంద్రీకరణ :** ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజలది. అంటే ప్రజలు తమ దగ్గర ఉన్న అధికారాన్ని వికేంద్రీకరించాలి. పౌరులు కేంద్రంగా కొత్త వికేంద్రీకరణ జరగాలి. ఇలాంటి వికేంద్రీకరణ సూత్రమే సబ్సిడియారిటీ సూత్రం.

ఎ) వ్యక్తి తాను, తన కుటుంబం చేసుకోగలిగిన పనులకు సంబంధించిన అధికారాలను తన దగ్గరే ఉంచుకుంటాడు. వాటిని ఇతరులకు బదిలీ చేయడు. ఉదాహరణకు ఎవరితో వివాహం చేసుకోవాలి – ఎలాంటి ఇల్లు కట్టుకోవాలి వగైరా.

బి) ఒక గ్రామంలో ఒక ప్రజాబృందానికి మాత్రమే వినియోగపడే వనరు లేదా సంస్థ ఏదైనా ఉంటే దానిని వినియోగించుకుంటున్న బృందం దగ్గరే ఆ అధికారాన్ని ఉంచుకుంటారు.

*ఉదాహరణ:* ఒక చెరువు నీటిని దాని కింద ఒక రైతుల బృందం వినియోగించుకుంటే ఆ నీటి వినియోగం మీద అధికారం ఆ బృందం దగ్గరే ఉండాలి. అలాగే ఒక రేషన్‌షాపును వినియోగించుకునే బృందం దగ్గరే దాని నిర్వహణకు సంబంధించిన అజమాయిషీ అధికారం ఉండాలి.

సి) ఒక బృందాన్ని మించి ఒక గ్రామంలో, పట్టణంలో నిర్వహించుకోగల పనులకు సంబంధించిన అధికారాలను ఆ గ్రామానికి బదిలీ చేస్తారు. ఆ గ్రామంలో చేసుకోలేని పనులకు సంబంధించిన అధికారాలను మాత్రమే మండలానికి, మండలాల్లో చేసుకోలేని పనులకు సంబంధించిన అధికారాలను మాత్రమే జిల్లా ప్రభుత్వాలకీ పంపిణీ చేస్తారు.

డి) జిల్లాలో చేసుకోలేని పనులకు సంబంధించిన అధికారాలను రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్రంలో చేసుకోలేని పనులకు సంబంధించిన అధికారాలను మాత్రమే జాతీయ ప్రభుత్వానికి దఖలు పరుస్తారు. సబ్సిడియారిటీ సూత్రం ప్రకారం ప్రజలు తమ అధికారాలను పంపిణీ చేసే పద్ధతి ఇలా ఉంటుంది. ఇది నిజమైన ప్రజాస్వామ్య వికేంద్రీకరణ.

## ప్రశ్న: గాంధీ, అంబేద్కర్‌ల రాజకీయం లోక్‌సత్తా పార్టీకి ఎందుకు స్ఫూర్తి అయ్యింది?

**వివరణ :** గాంధీజీ మన జాతిపిత. స్వాతంత్ర్యోద్యమ సారథి. రాజకీయ, సామాజిక రంగాలలో విలువలకి ప్రతీక. ఈ స్ఫూర్తిని మనం అందిపుచ్చుకోవాలి, కొనసాగించాలి.

H గాంధీజీ రాజకీయ కార్యకలాపాలకి ఒక పవిత్రతనీ, ఒక గౌరవాన్ని కల్పించారు. రాజకీయాన్ని సమాజహితం కోసం చేసే పవిత్ర కార్యకలాపంగా నిర్వహించారు. అదే మనకు బాట కావాలి. పలు మతాలు, కులాలు, భాషలు, ప్రాంతాలుగా ఉన్న ప్రజల్ని

ఒక జాతిగా సమీకరించి స్వతంత్రపోరాటాన్ని ఒక జాతీయోద్యమంగా నిర్వహించారు. మనమంతా భారతీయులం అన్న భావనని పాదుకొల్పారు. ఈ జాతీయ దృక్పథాన్ని మనం కోల్పోతే దేశం ఒకటిగా ఉండదు. మనకు దేశం ముఖ్యం కావాలి. పార్టీ ప్రయోజనాలకంటే దేశ ప్రయోజనాలు మిన్న కావాలి.

H గాంధీజీ రాజకీయ కార్యకలాపాలలో సామాజిక సంస్కరణలను, నిర్మాణ కార్యక్రమాలను అంతర్భాగం చేశారు. రాజకీయ ఉద్యమాలు సాగిస్తూనే నిర్మాణ కార్యక్రమాలను దానికి అనుసంధానించారు. హరిజనోద్ధోరణ, స్త్రీజనోద్ధరణ, మద్యపానం పై పోరు, గ్రామారోగ్యం, కుటీరపరిశ్రమలు వగైరా కార్యకలాపాలను సాగించారు.

H మంచి లక్ష్యాల సాధనకి మంచి మార్గాలనే అనుసరించాలని గాంధీజీ నొక్కి చెప్పారు. అహింసా మార్గంలో శాంతియుత పద్ధతుల్ని పాటించారు.

మంచి రాజకీయానికి గాంధీజీ ప్రతీక. లోక్‌సత్తా పార్టీకి ఇవన్నీ స్ఫూర్తిగా ఉంటాయి.

అంబేద్కర్ మన రాజ్యాంగ నిర్మాత. రాజ్యాంగ రచనకు సారథి. పుట్టుకతో వివక్షపై అవిశ్రాతంగా పోరాడిన యోధుడు. జాతీయోద్యమ విలువలకి, ఆకాంక్షలకి రాజ్యాంగంలో వ్యవస్థాగత రూపం ఇచ్చారు.

H పుట్టుకతో వివక్ష ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ. దీనిని తొలగించడానికి అంబేద్కర్ జీవితం అంతా పోరాడారు. ప్రజాస్వామ్యం మంచి ఫలితాలను ఇవ్వాలంటే తగిన రాజ్యాంగ వ్యవస్థలు, పాలనా వ్యవస్థలు, సేవలను అందించే వ్యవస్థలు ఉండాలి. కులనిర్మూలన కోసం, పుట్టుకతో వివక్ష తొలగింపు కోసం, మంచి ప్రజాస్వామ్య వ్యవస్థల కోసం సాగించే పోరాటానికి అంబేద్కర్ మనకు స్ఫూర్తినిస్తారు.

H రాజకీయపార్టీలు కొందరు వ్యక్తుల ప్రయివేటు ఆస్థి కాకూడదు. సమాజహితం కోసం చేసే రాజకీయంలో, పార్టీల అభ్యర్థుల ఎంపికలో ప్రజల పాత్ర ఉండాలి. పార్టీల అభ్యర్థుల ఎంపికలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని మన దేశంలో తొలిసారి సూచించింది అంబేద్కర్. అది మనకు స్ఫూర్తి కావాలి.

మంచి ప్రజాస్వామ్యానికి మంచి రాజకీయం, వివక్షతకు తావులేని వ్యవస్థాగత ఏర్పాట్లు అవసరం. ఇందులో ఒకటి లేకుండా మరొకటి కొనసాగదు. మంచి రాజకీయ వ్యవస్థ ఉన్నా తగిన వ్యవస్థాగత ఏర్పాట్లు లేకపోతే ఫలితాలు ప్రజలకు అందవు. మంచి వ్యవస్థాగత ఏర్పాట్లు ఉన్నా మంచి రాజకీయం లేకపోతే అది నిరుపయోగం అవుతుంది. అందుచేత ఈ రెండింటినీ మనం అనుసంధానం చేయాలి. అందుకు గాంధీజీ, అంబేద్కర్‌లు మనకు స్ఫూర్తి కావాలి.

# 2. నూతన రాజకీయ సంస్కృతి  ఒక చారిత్రక అవసరం

## ప్రశ్న : ప్రస్తుత రాజకీయం ఎందుకిలా దిగజారింది?

**వివరణ:**

### ఎ) రాజకీయం అధికార క్రీడ అయ్యింది

సమాజహితం కోసం పాటుపడాల్సిన రాజకీయం కేవలం అధికార క్రీడగా తయారైంది. అధికార క్రీడ అంటే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలి. అధికారాన్ని చెలాయించాలి. అందుచేత ఎన్నికల్లో గెలవడానికి సకల వక్రమార్గాలను అనుసరిస్తున్నారు. ఓట్లు కొంటున్నారు. మద్యం పోస్తున్నారు. నేరచరితుల్ని వినియోగిస్తున్నారు. వీటి కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు.

### బి) రాజకీయం వ్యాపారం అయ్యింది

రాజకీయం అధికార క్రీడ కావడంతో ఎన్నికల్లో గెలవడానికి కోట్లు ఖర్చుపెట్టడంతో ప్రారంభమై తిరిగి అంతకు పదిరెట్లు దండుకోవడం ప్రస్తుత రాజకీయంగా  సాగిపోతున్నది. రాజకీయం పూర్తిగా వ్యాపారం అయ్యింది. అక్రమసంపాదనకు నెలవు అయ్యింది. ప్రజాప్రతినిధులకు నియోజకవర్గాలు సామ్రాజ్యాలు అయ్యాయి. ట్రాన్స్ఫర్లు, పోస్టింగులు, కాంట్రాక్టులు, పోలీసు కేసులు, పథకాల పేరుతో అవినీతి వ్యాపారం సాగిపోతున్నది. దీనికితోడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రజలసొత్తుని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కబ్జా చేస్తున్నారు.

### సి) అవినీతికి అనువైన పాలనా పద్ధతులు

- అవినీతి యధేచ్ఛగా సాగాలంటే ఈ రాజకీయానికి కేంద్రీకృత పాలన ఉండాలి. పరిపాలనలో చీకటి ఉండాలి. ప్రజలకు జవాబుదారీతనం ఉండకూడదు. అందుకే ఎవరు ఎన్ని మాటలు చెప్పినా, ఎన్ని వాగ్దానాలు చేసినా ఆచరణలో ప్రజలభాగస్వామ్యాన్ని, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధుల బదిలీని ఎవరూ సాగనివ్వడం లేదు.

- ప్రస్తుత రాజకీయానికీ పారదర్శకతకీ పొసగదు. ప్రజాభిప్రాయం మేరకు సమాచారహక్కు చట్టం తెచ్చినా దాని అమలును తుంగలో తొక్కారు. పాలనలో చీకటిని కొనసాగిస్తున్నారు. అవినీతిని యధేచ్ఛగా సాగిస్తున్నారు.  పాలనలో జవాబుదారీతనం ఈ రాజకీయానికి సరిపడదు. వివిధ శాఖలలో జవాబుదారీతనం కోసం నామమాత్రంగా సిటిజన్స్ ఛార్టర్లు ప్రకటించి ఊరుకున్నాయి. వాటి అమలును పూర్తిగా విస్మరించారు.

### డి) జనాకర్షణకు ప్రలోభాలు

ఈ రాజకీయం ప్రజల మౌలిక సమస్యల్ని పట్టించుకోదు. దీనికి అంత తీరికగాని, అలాంటి ఆలోచనగాని ఉండదు. ఈ రాజకీయం పూర్తిగా జనాకర్షణ పథకాల మీద ఆధారపడుతుంది. తాత్కాలికంగా ఓట్లు తెచ్చే నినాదాలకు, పథకాలకు పరిమితం అవుతుంది. ఒకరు కలర్ టీవీలు అంటే మరొకరు కట్నకానుకలంటారు. దీనికితోడు కుల, మత, ప్రాంతీయ, భాషాసమస్యల్ని, భావోద్రేకాలను రాజకీయాలకు వినియోగించుకుంటున్నారు. ఇదీ మనం చూస్తున్న రాజకీయం.

## ప్రశ్న : కొత్తరాజకీయం ఒక చారిత్రక అవసరమా?

**వివరణ:** స్వతంత్రం వచ్చిన తర్వాత మనదేశ రాజకీయంలో తొలిదశ ముగిసింది. మనం రెండోదశ రాజకీయంలో ఉన్నాం. తొలిదశలో దేశంలో, రాష్ట్రాలలో ఏకపార్టీ గుత్తాధిపత్యం సాగింది. ఎక్కడైనా చాలాకాలం పాటు ఏకపార్టీ గుత్తాధికారం సాగితే అక్కడ తప్పనిసరిగా అధిపత్య ధోరణి, ఏకపక్ష వ్యవహారం పర్యవసానంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం చోటు చేసుకుంటాయి. ఇలాంటి ఏక పార్టీపాలనని తొలగించడానికి పార్టీల పుట్టుకలు, విలీన, సంలీనాలు అని వార్యం అవుతాయి. 1970 దశకంలో దేశ రాజకీయంలో ఇలాంటి మార్పులు జరిగాయి. దేశంలో, రాష్ట్రాలలో ఏక పార్టీ ఆధిపత్యదశ అంతరించి బహుళ పార్టీల దశ ప్రారంభమైంది. ఇది రెండోదశ. ఇప్పటికీ కొనసాగుతున్న దశ ఇది. ఈ దశలో పార్టీల మధ్య, కూటముల మధ్య పోటీ పెరిగింది. ఒకపార్టీ తర్వాత మరోపార్టీ లేదా మరొక కూటమి అధికారంలోకి వస్తున్నాయి. కాని ఈ పోటీ సమాజహితం కోసం చేసే రాజకీయ పోటీగా మారకపోగా కేవలం అధికార క్రీడగా రూపం ధరించింది. ఎలాగోలాగ గెలవడమే ముఖ్యం అయ్యింది తప్ప సమాజహితం తెరమరుగు అయ్యింది. అందుచేత అన్ని పార్టీలదీ ఒకటే రాజకీయ సంస్కృతి అయింది. ఎవరు అధికారంలోకి వచ్చినా పాలనతీరు మాత్రం మారడం లేదు.

ప్రజల కళ్ళ ముందు చాలా పార్టీలు ఉన్నాయిగాని, ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. విసుగెత్తిన ప్రజలు అధికారంలో ఉన్న వారిని గద్దెదించుతున్నారు. మరొకరిని గద్దెనెక్కిస్తున్నారు. వారిని దింపి మళ్ళీ వీరిని ఇలా మారుస్తున్నారు. దీనివల్ల అధికారంలోకి వచ్చే పార్టీలు మారుతున్నాయి. జెండాలు మారుతున్నాయి. ప్రజా ప్రతినిధులు మారుతున్నారు. ఆటగాళ్ళు మారుతున్నా ఆటతీరు మారడం లేదు. ప్రజలు పెనం మీద నుండి పొయ్యిలోకి, పొయ్యిలో నుండి పెనం మీదకీ మారుతున్నారు తప్ప వారిజీవితాలు మాత్రం మారడం లేదు. ఇది ఒక సంధి దశ. ఈ సంధి దశను అధిగమించే శక్తి పాతరాజకీయానికి లేదు. పాత రాజకీయంలో

మునిగితేలుతున్న పార్టీలకు అలాంటి శక్తిగాని, ఆసక్తిగాని లేదు. ఈ సంధిదశను అధిగమించాలంటే మన రాజకీయం  మూడవ దశలోకి ప్రవేశించాలి. ఈ కొత్తదశకి కొత్త తరహా రాజకీయం అవసరం.  అందుచేత నూతన రాజకీయ సంస్కృతి ఒక చారిత్రక అవసరం అయింది. ఈ చారిత్ర అవసరాన్ని నెరవేర్చడానికి, కొత్తతరానికి కొత్త రాజకీయాన్ని అందించడానికి లోక్‌సత్తా పార్టీ ఒక నూతన రాజకీయ సంస్కృతిని సాధించడం కోసం ఆవిర్భవించింది.

అధికార క్రీడగామారిన రాజకీయాన్ని సమాజహితం కోసం చేసే కార్యకలాపంగా మార్చడమే నూతన రాజకీయ సంస్కృతి  లక్ష్యం. పదవిచుట్టూ తిరిగే రాజకీయాన్ని ప్రజల చుట్టూ తిప్పాలి. ప్రజలు ప్రభువులు, పాలకులు సేవకులుగా మార్చడమే నూతన రాజకీయ సంస్కృతి.

ధన రాజకీయాన్ని జనరాజకీయం చెయ్యాలి. ఎన్నికలలో ఓట్ల కొనుగోళ్లకీ, మద్యం పంపిణికీ, ప్రలోభాలకీ స్వస్తి చెప్పి రాజకీయం నుండి అవినీతిని సమూలంగా తొలగించడమే నూతన రాజకీయ సంస్కృతి.

ప్రయివేటు ఆస్తిగా, వారసత్వ హక్కుగా మారిన పార్టీల స్థానంలో పూర్తిగా అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించి పార్టీలను సమాజ సంపదగా మార్చడమే నూతన రాజకీయ సంస్కృతి.

# 3. జనరాజకీయం ఎందుకోసం?

## ప్రశ్న: లోక్‌సత్తా పార్టీ సాధించతలపెట్టిన అంశాలు ఏమిటి?

**వివరణ :**

**1. పాఠశాల విద్య :** మనిషి శక్తి సామర్థ్యాలను కొన్ని వేల రెట్లు పెంచగలిగేది చదువుమాత్రమే. ఉన్న వాడికో చదువు లేని వాడికో చదువు అన్న అంతరాన్ని తొలగించాలి. సమాజంలో పేదరికానికి, అంతరానికి చదువు కారణం అయ్యింది. చదువు ద్వారా అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు కల్పిస్తే అది ప్రజల ఆర్థిక సామాజిక స్థితిగతుల్ని మార్చి వేస్తుంది. వివక్ష తొలగిపోవడానికి దారితీస్తుంది. పుట్టిన ప్రతి బిడ్డకీ కులంతో, డబ్బుతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాలను కల్పిస్తుంది. అందరికీ మంచి ప్రమాణాల విద్యని అందిస్తుంది. అర్హత, ఆసక్తి ఉన్న వారందరికీ పై చదువులకు డబ్బు అడ్డం కాకుండా చేస్తుంది. బిడ్డల చదువు బాధ్యతలను ప్రభుత్వం స్వీకరిస్తుంది.

**2. ఆరోగ్యం, వైద్యసేవలు :** ప్రస్తుతం ఒక కుటుంబం ఒకసారి అనారోగ్యానికి పాలైతే సంవత్సర ఆదాయంలో 60 శాతం దానికే ఖర్చు అవుతున్నది. పర్యవసానంగా ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారు. ఎవరికి ఆనారోగ్యం వచ్చినా డబ్బులేక సరైన వైద్యం అందించలేకపోవడం వల్ల నాతండ్రి, తల్లి, భార్య, భర్త, పిల్లలు మరణిచారన్న దు:ఖం ఎవరినీ వేధించకుండా చెయ్యాలి. లోక్‌సత్తా పార్టీ ప్రతి ఒక్కరికీ అరోగ్య కార్డును అందిస్తుంది. ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా వైద్యసేవలు ఉచితంగా పొందే వీలుకల్పిస్తుంది. అన్ని ఆసుపత్రులను ఆధునీకరిస్తుంది. వాటి నిర్వహణా పద్ధతిని మారుస్తుంది. రోగులకు వైద్యసేవలు అందిన తర్వాత ఆసుపత్రులకు డబ్బు సమకూర్చే పద్ధతిని, మంచి వైద్యసేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లకు, సిబ్బందికీ అదనపు ఆదాయం లభించే పద్ధతిని ప్రవేశపెడుతుంది.

**3. ఉపాధినైపుణ్యాలు :** చదువు ఎంత ఉన్నా ఉపాధినైపుణ్యాలు లేకపోతే పని దొరకదు. నైపుణ్యాలు లేకపోవడమే నిరుద్యోగానికి ప్రధాన కారణంగా ఉంది. యువతకి ఉపాధినైపుణ్యాలు అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. నిరక్షరాస్యులుగా ఉన్న యువతకి కూడా అక్షరాస్యతతోపాటు నైపుణ్యాలు అందించే ఏర్పాటు చేస్తుంది. మహిళలకు, గృహిణులకు స్వయం సంపాదనకు తగిన నైపుణ్యాలను అందిస్తుంది. చేతివృత్తుల వారికి కొత్త నైపుణ్యాలను అందించడం ద్వారా ఆ వృత్తులను ఆధునీకరించి ఆదాయం పెంచుకునే అవకాశం కల్పిస్తుంది.

**4. రైతుల, గ్రామీణ ఆదాయాల పెంపు :** నూటికి 70 మంది గ్రామీణులు వ్యవసాయం మీద ప్రధానంగా ఆధారపడి ఉన్నారు. ఇక్కడ ఆదాయాన్ని పెంచకపోతే ప్రజల జీవనస్థితిగతులు మారవు. వ్యవసాయాన్ని సంఘటితరంగం చెయ్యడం, పరపతి సౌకర్యాలను సులభతరం చెయ్యడం,

మార్కెట్ కమిటీల వ్యవస్థను పటిష్టం చెయ్యడం, వ్యవసాయంలో ఆధునిక అవసరాలకు తగిన విధంగా కొత్త ధోరణులు ప్రవేశ పెట్టడం, దళారుల ప్రమేయం లేకుండా విత్తనాలు, పురుగు మందులు అందించడం, ఇలా బహుముఖ వ్యూహం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి చేస్తుంది. మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల నుండి విముక్తం చేస్తుంది. దీని చుట్టూ గ్రామీణ ఆదాయాల పెంపుదలకు వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఉత్పత్తుల విలువ పెంచే పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రజల ఆదాయాల పెరుగుదలను సాధిస్తుంది.

**5. పేదలకు స్వంత ఆస్థి :** పేదలకు ఏదోఒక స్వంత ఆస్థిని కల్పిస్తుంది. సామాజిక న్యాయాన్ని సాధించడానికి మహిళలు, దళితులు, బలహీన వర్గాల పిల్లల చదువు, వైద్యం బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుంది. సామాజిక, ఆర్థిక హోదానీ మార్చడం ద్వారా కుల నిర్మూలనకు, వివక్ష తొలగింపుకీ దారులు వేస్తుంది.

**6. అసంఘటిత కార్మికులు :** రాష్ట్రంలో 90 శాతం మంది శ్రామికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. వ్యసాయ కూలీలుగా, గీత, చేనేత, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి తదితర చేతివృత్తులలో, గృహనిర్మాణ కార్మికులుగా, ఇళ్ళలో పనిమనుషులుగా, పట్టణాలలో హమాలీలుగా, హోటల్ కార్మికులుగా, రిక్షా, ఆటోరిక్షా డ్రయివర్లుగా, పరిశ్రమల్లో, కార్ఖానాలలో రోజువారీ క్యాజువల్ కార్మికులుగా అసంఖ్యాకులు ఉన్నారు. పనిదొరకకపోయినా, వయస్సు మీరినా వారి జీవితాలు బజారు పాలవుతున్నాయి. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించి రేపటి జీవనభయం వారికి లేకుండా చేస్తుంది.

**7. నగరీకరణ సమస్యలు :** పట్టణాలలో, నగరాలలో ట్రాఫిక్, కాలుష్యం, మంచినీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి, పేదలవాడలలో మౌలిక వసతులను అభివృద్ధి చెయ్యడానికి నిర్దిష్ట ప్రణాళికలతో అన్ని వసతులుగల పట్టణాలుగా అభివృద్ధి చేస్తుంది. కూడలి గ్రామాలను ఆధునిక వసతులు గల చిన్న పట్టణాలుగా రూపొందిస్తుంది.

**8. సామాజిక న్యాయం :** మహిళా సంక్షేమానికి, దళితులు, బలహీన వర్గాలు, ఆదివాసీలు, మైనారిటీల సంక్షేమానికి – ఓటుబ్యాంకు రాజకీయానికి దూరంగా – కుల వివక్షకీ, లింగవివక్షకీ తావు లేకుండా ఈ తరగతుల అభివృద్ధికి ప్రత్యేక తరహా కార్యక్రమాలను చేపడుతుంది. సంక్షేమ పథకాల అమలులో అవినీతిని అరికడుతుంది. అర్హులకు లబ్ధిచేకూరే ఏర్పాటు చేస్తుంది. అందరికీ గృహవసతి, జీవన భద్రతకు ఏర్పాట్లు చేస్తుంది.

**9. సత్వర న్యాయం :** సత్వర న్యాయం అందించడానికి స్థానిక కోర్టులను ఏర్పాటు చేస్తుంది. పోలీసులపై రాజకీయ ఒత్తిడి తొలగిస్తుంది. నేరపరిశోధనను వేరుచేసి రాజకీయ ఒత్తిడికి

వీలులేకుండా న్యాయ వ్యవస్థ పరిధిలో ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తుంది. తప్పుడు కేసుల బనాయింపులు, వేధింపులు లేకుండా చేస్తుంది.

ఇవీ లోక్‌సత్తా ఎజెండాలోని కొన్ని ముఖ్యమైన అంశాలు. ఇవన్నీ సాధించగలిగినవి. లోక్‌సత్తా పార్టీ చేసి చూపించగలవి.

## ప్రశ్న : మద్యం మహమ్మారిని ఎలా నియంత్రిస్తారు ?

**వివరణ :** మద్యపానం రాష్ట్రంలో లక్షలాది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలతో చెలగాటమాడుతున్నది. దాదాపు 50 లక్షల కుటుంబాలలో భర్త ఆదాయం తాగుడుకి పోగా భార్య సంపాదనమీద సంసారం నడుస్తున్నది. పిల్లల చదువు, ఆరోగ్యం ఈ కుటుంబాలకు దూరం అవుతున్నది. కుటుంబ కలహాలు, గృహహింసలకు ఇది కారణం అవుతున్నది. గ్రామాలలో, పట్టణాలలో కొట్లాటలకు, సంఘర్షణలకు, నేరాలకు మూలం అవుతున్నది.

ఇన్ని అనర్థాలు జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం మద్యాన్ని ఆదాయమార్గంగా ఎంచుకుని పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి.

రాష్ట్రంలో 8000 మద్యం షాపుల్ని, 1లక్షా 50వేలు బెల్టు షాపుల్ని పెట్టి అమ్మకాలు పెంచడానికి కోటాలు నిర్ణయించి ప్రభుత్వమే అమ్మకాలను ప్రోత్సహిస్తున్నది. మద్యం దుకాణాల దగ్గరే తాగిపోవడానికి అనుమతిస్తున్నది. లైసెన్సు ఫీజు కట్టినవాళ్లకల్లా బార్లు పెట్టుకోవడానికి అనుమతిస్తున్నది. ప్రధాన రహదారుల వెంట మద్యం షాపుల్ని, బార్లని అనుమతించడం ద్వారా అనేక ప్రమాదాలు జరిగిపోతున్నాయి.

లోక్‌సత్తాపార్టీ ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కంకణం కట్టుకుంది. మధ్యనిషేధం మంచి మార్గంగా కనిపించినా అది ప్రపంచంలోగానీ, ఈ రాష్ట్రంలోగానీ సఫలం కాలేదు. పైగా అది రకరకాల దుష్పరిణామాలకు, కల్తీసారా మరణాలకు, మాఫియాల పుట్టుకకు దారితీసింది, అందుచేత లోక్‌సత్తా కఠినమైన మద్యనియంత్రణ ద్వారా ఈ మహమ్మారినుండి ప్రజలను కాపాడాలని భావిస్తున్నది.

- లోక్‌సత్తాపార్టీ రాష్ట్రంలోని అన్ని బెల్టుషాపుల్ని రద్దు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న 8000 లైసెన్సు షాపులను గణనీయంగా తగ్గిస్తుంది. ప్రభుత్వమే ఈ షాపుల్ని నిర్వహిస్తుంది. అమ్మకం రోజులను, వేళలను కుదిస్తుంది.
- రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట మద్యం షాపులు లేకుండా చేస్తుంది.
- రాష్ట్రంలో బహిరంగ మద్యపానాన్ని నిషేధిస్తుంది.
- నాటుసారా, గుడుంబా వంటి అక్రమ సారాయిని పూర్తిగా నిషేధించి స్థానిక ప్రభుత్వాలకి, మహిళా సంఘాలకి అక్రమ సారాయిని అదుపుచేసే అధికారాలు ఇస్తుంది.

- మద్యపానంవల్ల కలిగే అనర్థాలపై విస్తృతమైన ప్రచారాన్ని సాగిస్తుంది. డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తుంది.

## ప్రశ్న : రాజకీయంలో అవినీతిని తొలగించడానికి లోక్‌సత్తా ఏం చేస్తుంది?

**వివరణ:** దేశంలో,రాష్ట్రంలో రాజకీయమే అవినీతికి కేంద్ర బిందువు అయ్యింది. కంచే చేను మేసినట్లు పరిపాలకులే అవినీతిపరులైతే పాలన అంతా అవినీతి మయం అవుతుంది.

ఎన్నికల్లో ఓట్లు కొనడం, మద్యం పొయ్యడం, నేరచరితుల్ని పోషించడం, లేని బలాన్ని చూపించడానికి సభలు, ప్రదర్శనలకి కిరాయి జనాన్ని సమీకరించడానికి లక్షలు, కోట్లు రాజకీయం పేరుతో ఖర్చు చేస్తున్నారు. అధికారం దక్కగానే పెట్టిన పెట్టుబడికి పదిరెట్లు సంపాదించుకోవడానికి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు.

- అధికార క్రీడగా, గెలుపే ప్రధానంగా ఉన్న ప్రస్తుత రాజకీయాన్ని లోక్‌సత్తా పార్టీ సమాజహితం చేసే పవిత్ర కార్యకలాపంగా మారుస్తుంది. రాజకీయ అవినీతికి తావులేని జనరాజకీయం చేస్తుంది.
- లోక్‌సత్తా పార్టీ ఎట్టి పరిస్థితులలోనూ ఓట్లు కొనుగోళ్ళకీ, మద్యం వంపిణీకి, ఇతర ప్రలోభాలకూ పాల్పడదు. అధికారం పొందితే తిరిగి సంపాదించాల్సిన అవసరం లేని రాజకీయాన్ని సాగిస్తుంది.
- రాజకీయ వ్యవస్థలో, ఎన్నికల వ్యవస్థలో అవినీతికి తావులేకుండా సమగ్రమైన ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేస్తుంది.
- చట్టసభలనీ – ప్రభుత్వ వ్యవహారాలనీ వేరుచేస్తుంది. ప్రజాప్రతినిధుల అవినీతి కోసం ఏర్పడిన ఆధునిక జమీందారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తుంది.
- పార్లమెంటు సభ్యులకు, శాసనసభ్యులకు ఇస్తున్న నియోజక అభివృద్ధి నిధులను రద్దుచేస్తుంది. రాష్ట్రకేంద్రంలో, దేశ రాజధానిలో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ నివాస వసతిని కల్పిస్తుంది. నియోజక వర్గాలలో కార్యకలాపాల నిర్వహణకు అవసరమయ్యే అన్నివసతులు కల్పిస్తుంది. కానీ వారికి స్వంత గృహాలు ఇళ్ల స్థలాల పథకాలను రద్దుచేస్తుంది.
- ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను విచారించడానికి లోకాయుక్తకు విశేష అధికారాలు కల్పిస్తుంది. అవినీతి కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులపై విచారణ చేపట్టడానికి అవరోధంగా వున్న చట్టాలను సవరిస్తుంది. అవినీతిపరుల ఆస్తుల స్వాధీనానికి చట్టం తెస్తుంది.

- పరిపాలనను పూర్తిగా వికేంద్రీకరిస్తుంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, విధులను, సిబ్బందిని బదలాయిస్తుంది. అవినీతిని నిరోధించడానికి జిల్లా స్థాయిలో ఒక అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేస్తుంది. అవినీతి కేసులపై 3 నెలలలో విచారణ పూర్తిచేసి తీర్పుచెప్పే పద్ధతులను తెస్తుంది.
- ప్రభుత్వ కాంట్రాక్టులు, టెండర్లకు పారదర్శకమైన పద్ధతిని ప్రవేశ పెడుతుంది. సమాచారహక్కును పూర్తిస్థాయిలో అమలు చేస్తుంది.
- ప్రజలకు సేవలు అందించడంలో, పథకాలు అమలు చేయడంలో అవినీతిలేకుండా చేయడానికి సిటిజన్స్ చార్టర్లను కఠినంగా అమలు చేస్తుంది.

ఈ చర్యల ద్వారా రాజకీయ అవినీతికి అడ్డుకట్ట వేస్తుంది.

## ప్రశ్న : పంచాయితీలను, మున్సిపాలిటీలను లోక్‌సత్తా పార్టీ స్థానిక ప్రభుత్వాలుగా ఎలా రూపొందిస్తుంది ?

**వివరణ :** పౌరులు కేంద్రంగా ఇంటిముందు ప్రభుత్వం కంటి ముందు పాలన అందిస్తుంది. ప్రజల సొమ్ము ముందుగా వారునివసించే గ్రామాలలో, పట్టణాలలో, వార్డులలో ప్రజల డబ్బు ప్రజల భాగస్వామ్యంతో వారి కళ్ళముందు, వారి అవసరాలు తీర్చడం కోసం ఖర్చు అయ్యే ఏర్పాటు చేస్తుంది.

ప్రతి జిల్లాకి ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అన్ని మున్సిపాలిటీలు, పంచాయితీలను స్థానిక ప్రభుత్వాలను చేస్తుంది. వీటికి రాష్ట్ర బడ్జెట్‌లో 50 శాతం వాటా జిల్లాలవారీగా కేటాయిస్తుంది. మున్సిపాలిటీలకు, పంచాయితీలకు నేరుగా నిధులు అందే ఏర్పాటు చేస్తుంది. అవినీతి జరగకుండా జిల్లాకి ఒక అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. సమాచారహక్కు, సిటిజన్స్‌ఛార్టర్లను ఖచ్చితంగా అమలు చేస్తుంది.

నగరాలు, పట్టణాలలో ప్రతిపోలింగ్ స్టేషన్ పరిధిలో ఏరియా ప్రజాసభల్ని వార్డు/డివిజన్ స్థాయిలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన వార్డు స్థాయి ప్రజాకమిటీలను ఏర్పాటు చేసి స్థానిక అవసరాలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా నిధులు, విధులు, సిబ్బందిని వార్డు కమిటీలకు ఏర్పాటు చేస్తుంది.

## ప్రశ్న : మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డు ప్రజాకమిటీలను ఎలా ఏర్పాటు చేస్తుంది?

**వివరణ :** మంచి ప్రజాస్వామ్యంలో పౌరులు కేంద్రంగా పరిపాలన సాగాలి. ప్రజల భాగస్వామ్యంతో సాగాలి. ప్రజల పన్నుల సొమ్ము వారి అవసరాల కోసం, వారి కళ్ల ముందు ఖర్చు కావాలి.

దీనిని ఆచరణలో పెట్టడానికి మున్సిపాలిటీలలో, కార్పొరేషన్లలో ప్రతి వార్డులో ఒక వార్డు కమిటీని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఒక ఏరియా ప్రజాసభను లోక్‌సత్తా పార్టీ ఏర్పాటు చేస్తుంది.

**వార్డు ప్రజా కమిటీలు :**

- ప్రతి వార్డు కమిటీకి ఆ వార్డు/ డివిజన్ కౌన్సిలర్ అధ్యక్షులుగా వుంటారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఏర్పడే ఏరియా ప్రజాసభ రహస్య బ్యాలట్ ద్వారా ఎన్నుకునే ఇద్దరు ప్రతినిధులు (ఒక మహిళ, ఒక పురుషుడు) ఈ వార్డు కమిటీలో సభ్యులుగా వుంటారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఇందులో భాగస్వాములుగా వుంటారు.

- ఆ వార్డులోని రోడ్లు తుడవడం, చెత్త తొలగింపు, మురుగునీటి పారుదల, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, రోడ్ల రిపేర్లు, పార్కులు, గ్రంధాలయాలు వగైరా పనులు పూర్తిగా ఈ కమిటీలే నిర్వహించుకునే అధికారాలను దఖలు పరుస్తుంది. దీనికి సంబంధించిన సిబ్బంది పూర్తిగా ఈ కమిటీ అధీనంలో ఉంటారు.

  ఆ వార్డు పరిధిలో ప్రాధమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్ వాడీలు, రేషన్ షాపులు, ఇతర స్థానిక సేవల సంస్థల మీద అజమాయిషీ, అభివృద్ధి కార్యక్రమాలు ఈ వార్డు కమిటీల పరిధిలో ఉంటాయి.

- ప్రతి వార్డు నుండీ వసూలయ్యే మున్సిపల్ పన్నులలో ఆ వార్డు అభివృద్ధి స్థాయిని బట్టి ప్రధాన వాటా ఈ కమిటీలకు దఖలు చేస్తుంది.

ఇలా అధికారాలు, నిధులు, సిబ్బంది కలిగిన వార్డు కమిటీలను లోక్‌సత్తా పార్టీ ఏర్పాటు చేస్తుంది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే ఇలాంటి సమస్యలన్నింటికీ వార్డు లోపలే పరిష్కారం జరిగే ఏర్పాటు చేస్తుంది.

**ఏరియా ప్రజాసభ:** ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లందరూ ఈ ఏరియా ప్రజాసభలో సభ్యులుగా వుంటారు.

- ప్రతి పోలింగ్ స్టేషన్ నుండి ఇద్దరు ప్రతినిధులను వార్డు ప్రజాకమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు.
- మున్సిపాలిటీ, కార్పొరేషన్ నిర్వహించే అన్ని పథకాల లబ్ధిదారులను ఈ ఏరియా ప్రజాసభలో పారదర్శకంగా ఎంపిక చేస్తారు. లబ్ధిదారుల జాబితాలను రూపొందిస్తారు.
- తమ ప్రాంతంలోని సమస్యల్ని గుర్తించడం, ప్రాధాన్యతా క్రమాన్ని నిర్వహించడం ఈ ఏరియా ప్రజా సభలు చేస్తాయి.

ఇలా ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలకు ఎక్కడికక్కడే పరిష్కారాలు లభించే వికేంద్రీకరణ ద్వారా ఇంటి ముందు ప్రభుత్వాన్ని కంటి ముందు పాలనని సాధిస్తుంది.

**ప్రశ్న: సిటిజన్స్ ఛార్టర్లు అంటే ఏమిటి? అవి ఎలా ఉపయోగపడతాయి?**

**వివరణ:** సిటిజన్స్ ఛార్టర్లు అంటే పౌరసేవా పత్రాలు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు అందించే సేవల వివరాలు, వాటిని అందించడానికి పట్టే సమయాన్ని తెలియజేసే పత్రం.

ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలనా యంత్రాంగం ప్రజల కోసం, ప్రజల సొమ్ముతో నడుస్తున్నాయి. అందుచేత ప్రజలకు సేవలు అందించే జవాబుదారీతనం ప్రతి కార్యాలయానికి వుండితీరాలి. అందుకోసం రూపొందించినవే సిటిజన్స్ ఛార్టర్లు.

**సిటిజన్స్ ఛార్టర్లు ఇలా వుండాలి :**

- ప్రతి ప్రభుత్వ కార్యాలయం విధిగా అందించే సేవల పట్టిక ఉండాలి.
- ఏ సేవ ప్రజలకు ఎన్ని రోజులలో అందించేది ఉండాలి.
- నిర్ధిష్టమైన దరఖాస్తు వుండాలి, దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వాలి.
- గడువులోగా సేవ అందించకపోతే ప్రతిరోజు ఆలస్యానికి ప్రజలకు పరిహారం చెల్లించాలి.
- ప్రజలకు అత్యవసర సేవలకోసం నామమాత్రపు రుసుంతో తత్కాల్ పద్ధతి ఉండాలి.
- ప్రతి కార్యాలయంలో అన్ని దరఖాస్తులు స్వీకరించడానికి అన్ని సేవలు అందించడానికి ఒక పౌర సేవాకేంద్రం వుండాలి.

రాష్ట్రంలో ఇలాంటి పౌర సేవాపత్రాల ఏర్పాటు కోసం లోక్‌సత్తా ఉద్యమం కృషి చేసి కొన్ని విజయాలు సాధించింది. ఇప్పుడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ పేరుకి సిటిజన్స్ ఛార్టర్లు వున్నాయి. ప్రభుత్వానికి రాజకీయ సంకల్ప లేకపోవడం వల్ల అని అమలు కావడం లేదు. ఉన్నంతలో మున్సిపాలిటీలు /కార్పొరేషన్లలో ప్రకటించిన సిటిజన్స్ ఛార్టర్లు కాస్త మెరుగుగా ఉన్నాయి. అయితే కేవలం 5 సేవలకే ఈ పద్ధతిని పరిమితం చేశారు. పౌరసేవా కేంద్రం ఏర్పాటు. దరఖాస్తు దారునికి రశీదు ఇచ్చే పద్ధతి ఆలస్యానికి ప్రతిరోజుకీ 50 రూపాయలు ప్రజలకు పరిహారం చెల్లించే పద్ధతీ వున్నాయి. కొంతమేరకు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి.

ఉదాహరణకి మీరు ఒక మున్సిపాలిటీలో జనన సర్టిఫికేటుకు దరఖాస్తు చేస్తే రశీదు పొందవచ్చును. 5 రోజుల గడువులోగా మీకు సర్టిఫికేటు ఇవ్వకపోతే ప్రతిరోజు ఆలస్యానికి 50 రూపాయలు మీకు పరిహారంగా ఇస్తారు. ఈ పరిహారాన్ని ముందుగా మున్సిపాలిటీ మీకు చెల్లించి తర్వాత దీనికి బాధ్యులైన ఉద్యోగి జీతం నుండి రాబట్టుకుంటారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సిటిజన్స్ ఛార్టర్లను అమలు చేస్తే ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుడు పూర్తిగా తొలగిపోతుంది.

## ప్రశ్న: పాలనా సమాచారాన్ని ప్రజలు ఎలా పొందవచ్చును?

**వివరణ:** 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టం వచ్చింది. ఈ చట్టాన్ని రూపొందించడంలో, సాధించడంలో లోక్‌సత్తా ఉద్యమం కీలకమైన పాత్ర వహించింది. ఈ చట్టం వల్ల పాలనా సమాచారాన్ని పొందడం ప్రజల హక్కు అయింది. కోరిన సమాచారాన్ని అందించడం జాతీయ, రాష్ట్ర ప్రభుత్వశాఖల, సంస్థల బాధ్యత అయింది.

- ప్రతి జాతీయ, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో, కార్యాలయాలలో, సంస్థలలో ఒక పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ అధికారి విధిగా వుంటారు.
- ప్రజలు తమకు కావలసిన సమాచారాన్ని నిర్దిష్టంగా వ్రాసి ఈ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం. 10 రూపాయలు. పంచాయితీలలో సమాచారాన్ని కోరే దరఖాస్తులకు రుసుం లేదు. దారిద్ర్య రేఖకు దిగువున వున్న వారికి దరఖాస్తు రుసుం లేదు.
- జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు, కార్యాలయాలు, సంస్థలన్నింటి నుండి ప్రతి పౌరుడు తనకు కావలసిన సమాచారాన్ని కోరి, పొందవచ్చును. ఎందుకు కోరుతున్నదీ కారణాలు చెప్పనవసరం లేదు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, సంస్థ తన సంస్థకు సంబంధించిన వివరాలు, కార్యకలాపాలు, అందించే సేవల వివరాలు, మొత్తం మీద 16 అంశాలను తమంతట తామే విధిగా వెల్లడించాలి. ఇవి కాకుండా ప్రజలు కోరిన సమాచారాన్ని అందించాలి.

ఉదాహరణకి స్థానికంగా మీరు పంచాయితీ, మున్సిపాలిటీ ఆదాయ వ్యయాలను, వివిధ పథకాలు వాటి నియమనిబంధనలు, రేషన్ షాపుల వారీగా కార్డు దారుల జాబితాలను, రోడ్లు, భవనాలు, ప్రాజెక్టుల కాంట్రక్టు వివరాల సమాచారం పొందవచ్చును. నిర్మాణాలు, కట్టడాల శాంపిల్స్‌ను పొందవచ్చును.

- దరఖాస్తు చేసుకున్న 30 రోజులలోగా సమాచారం అందించకపోతే పై అధికారికి అప్పీలు చేసుకోవాలి. అయినప్పటికీ మీకు సమాచారం ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైతే రాష్ట్ర సమాచార కమీషన్‌కు, జాతీయ ప్రభుత్వ సంస్థలైతే జాతీయ సమాచార కమీషన్‌కు అప్పీలు చేసుకోవాలి.
- కోరిన సమాచారాన్ని గడువులోగా ఇవ్వకపోయినా, పూర్తి సమాచారాన్ని ఇవ్వకపోయినా, తప్పుడు సమాచారాన్ని ఇచ్చినా, సంబంధిత పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ అధికారిపై క్రమశిక్షణా చర్యలు, 25000 రూపాయలు వరకు జరిమానా విధించే అధికారం రాష్ట్ర, కేంద్ర సమాచార కమీషన్లకు వుంది.

అందుచేత సమాచారాన్ని కోరడం, పొందడం, వినియోగించుకోవడం పూర్తిగా ప్రజల చేతుల్లో వుంది.

# 4. కొత్త తరహా పార్టీ లోక్‌సత్తాపార్టీ

**ప్రశ్న: లోక్‌సత్తా పార్టీలో సంస్థాగతమైనకొత్త తరహా అంశాలు ఏమిటి?**

**వివరణ:** కొత్త తరానికి కొత్త రాజకీయాన్ని అందించే జనరాజకీయం కోసం లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది.

**1. లోక్‌సత్తా పార్టీ సభ్యుల పార్టీ :** లోక్‌సత్తా పార్టీలో సాధారణ సభ్యులు, క్రియాశీల సభ్యులు ఉంటారు. ధన రాజకీయాన్ని జనరాజకీయం చెయ్యడానికి నిబద్ధతగల క్రియాశీల సభ్యులు ఉంటారు. క్రియాశీల సభ్యులకు విధిగా రాజకీయ శిక్షణ ఉంటుంది. ప్రవర్తనా నియమావళి ఉంటుంది. క్రియాశీల సభ్యులు పార్టీ కార్యకలాపాలలో పాలు పంచుకోవాలి. పార్టీకి తమ ఆదాయంలో కొంత శాతం విరాళంగా ఇవ్వాలి. లోక్‌సత్తా పార్టీ పూర్తిగా సభ్యుల మీద ఆధారపడిన పార్టీగా ఉంటుంది. నిబంధనావళి ప్రకారం గ్రామ/ వార్డు స్థాయి శాఖల నాయకత్వాన్ని అందరు సభ్యులూ ఎన్నుకుంటారు. మండల/ పట్టణ స్థాయి నుండి జాతీయస్థాయి వరకు సమన్వయకర్తల్ని పార్టీ క్రియాశీల సభ్యులంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. సమన్వయకర్తలు పార్టీకి సారధులుగా వుంటారు.

**రీకాల్ పద్ధతి :** పార్టీ నాయకత్వ స్థానాలలో ఎంపికైన వారు సభ్యుల విశ్వాసాన్ని కోల్పోతే వారిని వెనక్కి పిలిచే రీకాల్ పద్ధతి నిబంధనావళిలో ఉంది.

**2. ప్రత్యేక ఎన్నికల అథారిటీ :** లోక్‌సత్తా పార్టీకి ప్రతి మూడేళ్ళకు సంస్థాగత ఎన్నికలు సకాలంలో సక్రమంగా నిర్వహించడానికి వీలుగా స్వయంప్రతిపత్తిగల ఎన్నికల అథారిటీలు రాష్ట్రస్థాయిలో, వివిధ స్థాయిలలో ఏర్పడతాయి.

పార్టీ కమిటీల నేతల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించే అధికారాన్ని ఈ ఎన్నికల అథారిటీ కలిగి వుంటుంది. మండల/పట్టణస్థాయి క్రియాశీల సభ్యుల నమోదు ఈ ఎన్నికల అథారిటీ చేపడుతుంది. సాధారణ, క్రియాశీల సభ్యుల జాబితాలను ఈ అథారిటీ నిర్వహిస్తుంది. ఆ జాబితాల ప్రాతిపదిక మీద పార్టీలో ఎన్నికలు జరుగుతాయి.

**రహస్యబాలట్ :** అన్ని స్థాయిలలో రహస్యబాలట్ ద్వారా ప్రిఫరెన్సియల్ (ప్రాధాన్యతా క్రమం) ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి.

**3. పార్టీలో స్వయందిద్దుబాటు ఏర్పాట్లు:** నూతన సంస్కృతికి అనుగుణంగా వ్యవహరించడానికి, అవాంఛనీయశక్తులు చొరబడకుండా చూడటానికి వీలుగా స్వయంప్రతిపత్తి గల క్రమశిక్షణ అథారిటీలు కూడా రాష్ట్ర స్థాయినుండి మండల/పట్టణస్థాయి వరకు ఉంటాయి. పార్టీ క్రియాశీల సభ్యుల మీద, నాయకత్వం మీద ప్రజల నుండి, సభ్యులనుండి వచ్చే ఫిర్యాదులతోపాటు పత్రికలలో వచ్చే వార్తలను కూడా పరిగణనలోకి తీసుకుని విచారించి తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారాన్ని ఈ క్రమశిక్షణ అథారిటీలు కలిగివుంటాయి.

**4. సామాన్యుల పార్టీ :** పుట్టుకతో వివక్షతకు గురయ్యే దళితులు, మహిళలు, అలాగే బలహీనవర్గాలు, ఆదివాసులు, మైనారిటీలకు పార్టీలో నిర్ణయాధికారం వుండేలా నిబంధనావళిలోనే ఏర్పాట్లు జరిగాయి. పార్టీ విధాన నిర్ణయాలు చేసే జనరల్ కౌన్సిలు, వర్కింగ్ కమిటీలలో మూడోవంతు స్థానాలను మహిళలకు, మరో మూడోవంతు స్థానాలను ఇతర బడుగు వర్గాలకు నిర్దిష్టమైన కేటాయింపు వుంది.

**5. యువతరం పార్టీ :** కొత్త తరానికి కొత్త రాజకీయం అన్న నినాదాన్ని ఆచరణలో పెట్టడానికి వీలుగా పార్టీ జనరల్ కౌన్సిల్ లో 50 శాతం స్థానాలు విధిగా 40 ఏళ్ళ లోపువారికి దక్కేలా ఏర్పాటు వుంది. ఒకవేళ జనరల్ కౌన్సిలులో అలాంటి వారు తగిన సంఖ్యలో ఎన్నిక కాకపోతే ఎన్నికైనవారిలో ఎక్కువ వయస్సుగలవారు ఆహ్వానితులుగా పరిగణింపబడి ఆ స్థానాలలో యువతకు అవకాశం కల్పించాలని పార్టీ నిబంధనావళిలో నిర్దేశించబడింది.

## ప్రశ్న: లోక్‌సత్తా పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల్ని ఎలా నిర్ణయిస్తారు?

**వివరణ:** లోక్‌సత్తా పార్టీ తలపెట్టిన జన రాజకీయంలో ఇదొక కీలకమైన అంశం. అభ్యర్థులను ప్రజలు నిర్ణయించుకునే ఒక వినూత్న పద్ధతి లోక్‌సత్తా పార్టీ దేశంలో, రాష్ట్రంలో శ్రీకారం చుట్టింది.

నడుస్తున్న పాత రాజకీయంలో పోటీ చేసే అభ్యర్థుల నిర్ణయం పార్టీల గుత్త సొత్తుగా వుంది. అధిష్టాన వర్గం పేరుతో అభ్యర్థుల నిర్ణయం సాగిపోతున్నది. అభ్యర్థుల దరఖాస్తుల దగ్గర నుండి టిక్కెట్లు పొందడం వరకూ అన్నీ కొనుక్కునే స్థితి వచ్చింది. గెలుపు గుర్రాల పేరుతో ధనబలం, కండబలం, వారసత్వబలం ఉన్న వారికే టికెట్లు దక్కుతున్నాయి. పార్టీలు తమపైన రుద్దిన అభ్యర్థులలో ఎవరికో ఒకరికి ఓటు వెయ్యడం తప్ప ప్రజలకు మరోదారి లేకుండా పోయింది.

లోక్‌సత్తా పార్టీ దీనికి భిన్నంగా "ప్రాథమిక ప్రజా ఎన్నిక" పద్ధతి ద్వారా తమ అభ్యర్థిని నిర్ణయించుకునే అధికారాన్ని ప్రజలకే కల్పించింది. ఎన్నికలు ప్రజల కోసం; అందుచేత పార్టీల అభ్యర్థుల నిర్ణయంలో ప్రజలకు భాగస్వామ్యం ఉండి తీరాలని లోక్‌సత్తా విశ్వసిస్తున్నది.

లోక్‌సత్తా పార్టీ తరపున పోటీ చెయ్యాలనుకునే అభ్యర్థులంతా పార్టీకి దరఖాస్తు చేసుకుంటారు. జరిగే ఎన్నిక స్థాయిని బట్టి (పార్లమెంటు, అసెంబ్లీ, మున్సిపాలిటీలు, పంచాయితీలు వగైరా) లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులకు అర్హతలను నిర్ణయిస్తుంది. నేరచరిత, అవినీతి చరిత లేని వారిని, పార్టీ నిర్దేశించిన అర్హతలున్న వారందరినీ అభ్యర్థుల జాబితాగా ప్రకటిస్తుంది.

ఈ జాబితాలో తమకు ఎవరు అభ్యర్థిగా వుండాలన్నది ప్రజల నిర్ణయానికి వదిలివేస్తుంది. ముందుగా " ప్రాథమిక ప్రజా ఎన్నిక" ను నిర్వహిస్తుంది. ఆ నియోజక వర్గంలోని ఓటర్లంతా ఈ ప్రాథమిక ప్రజాఎన్నికలో పాల్గొనడానికి పోలింగ్ స్టేషన్ల వారీగా ఏర్పాట్లు చేస్తుంది. రహస్య బ్యాలెట్ ద్వారా, ప్రాధాన్యతా క్రమ ఓటింగ్ (ప్రిఫరెన్షియల్) పద్ధతిలో ప్రజల మద్దతు పొందిన అభ్యర్థినే పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తుంది. మీ అభ్యర్థిని మీరే నిర్ణయించుకోండి, మీరే గెలిపించుకోండి అన్నదే లోక్‌సత్తా పార్టీ జన రాజకీయం.

## ప్రశ్న : లోక్‌సత్తా పార్టీ సంస్థాగత చట్రం ఎలా ఉంటుంది?

**వివరణ: ఎ) ప్రాథమిక శాఖ:** పంచాయితీ, మున్సిపల్ వార్డు పరిధిలో ప్రాథమిక శాఖలు ఉంటాయి. వీటి పరిధిలో వృత్తి నిపుణులు, యువత, మహిళలకు ప్రత్యేక యూనిట్లు ఉంటాయి.
**బి) మధ్యంతర శాఖ:** మండల, మున్సిపల్ పట్టణం, నగర కార్పొరేషన్ల పరిధిలో మధ్యంతర శాఖలు ఉంటాయి. వృత్తి నిపుణులు, యువత, విద్యార్థి, మహిళలకు ప్రత్యేకశాఖలు ఉంటాయి.

**సి) జిల్లాశాఖ డి) రాష్ట్రశాఖ ఇ) జాతీయపార్టీ**

**లోక్‌సత్తా పార్టీలో సభ్యత్వం రెండు రకాలుగా ఉంటుంది :** 1. సాధారణ సభ్యత్వం; రుసుము 10 రూపాయలు. 2. క్రియాశీల సభ్యత్వం; రుసుము 25 రూపాయలు. ఆదాయాన్ని బట్టి విరాళం చెల్లించాల్సి ఉంటుంది. సభ్యత్వ కాలం 3 సంవత్సరాలు.

**ఎన్నికల పద్ధతి:** అన్ని స్థాయిలలో ఒక కో-ఆర్డినేటర్, ఒక కార్యదర్శి, ఒక కోశాధికారి ఉంటారు. అన్ని స్థాయిలలో కో-ఆర్డినేటర్‌ను క్రియాశీల సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. (ప్రాథమిక శాఖలకు సభ్యులందరూ ఎన్నుకుంటారు)

- పార్టీకి అన్నిస్థాయిలలో వర్కింగ్ కమిటీ, కార్యవర్గం, జనరల్ కౌన్సిళ్లు ఉంటాయి.
- జనరల్ కౌన్సిళ్లు వర్కింగ్ కమిటీలను ఎన్నుకుంటాయి.
- అన్ని సంస్థాగత ఎన్నికలను ఎన్నికల అథారిటీ నిర్వహిస్తుంది. రహస్యబ్యాలట్ ద్వారా ప్రిఫరెన్సియల్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి.

## ప్రశ్న : పార్టీ శాఖలను ఎలా ఏర్పాటు చేసుకోవచ్చును?

**వివరణ :** 1. ఎ) మున్సిపాలిటీలు/ కార్పొరేషన్లలో ఒక వార్డు/ డివిజన్ పరిధిలోని ప్రాథమిక సభ్యులు, క్రియాశీల సభ్యులు పార్టీశాఖను ఏర్పాటు చేసుకోవాలి. పార్టీ శాఖకు ఒక కోఆర్డినేటరు, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు.

బి) మున్సిపల్ వార్డు/ డివిజన్ పరిధిలోని కాలనీలు/ పేదల వాడలలోని పార్టీ సభ్యులను బృందాలుగా విభజించుకోవచ్చును. ఈ బృందాలకు ఒక కన్వీనర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.

సి) మున్సిపల్ వార్డు/ డివిజన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసుకోవచ్చును. ఈ బృందానికి ఒక గ్రూపు లీడర్ ఉంటారు.

డి) మున్సిపల్ వార్డు/ డివిజన్ స్థాయిలో మహిళాసత్తా, యువసత్తా వృత్తి నిపుణుల (డాక్టర్లు, లాయర్లు వంటి) శాఖలను ఏర్పాటు చేసుకోవచ్చును. ఈ శాఖలకు అధ్యక్షుడు, కార్యదర్శి ఉంటారు.

ఇ) మున్సిపల్ వార్డు/ డివిజన్ పరిధిలోని కాలనీలు/ పేదల వాడలలో మహిళాసత్తా, యువసత్తా యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చును. ఈ యూనిట్లకు కన్వీనర్లు ఉంటారు.

2. ఎ) గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రాథమిక, క్రియాశీల సభ్యులతో ఒక శాఖను ఏర్పాటు చేసుకోవాలి. దీనికి ఒక కోఆర్డినేటర్, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. గ్రామ స్థాయిలో కూడా శివారు గ్రామలలోని సభ్యులను ప్రత్యేక బృందాలుగా రూపొందించుకోవచ్చును.

బి) గ్రామ పంచాయితీశాఖ పరిధిలో యువసత్తా, మహిళాసత్తా యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చును. వీటికి ఒక కన్వీనర్ ఉంటారు.

## ప్రశ్న : లోక్‌సత్తా పార్టీకి ఎలాంటి నాయకత్వ బృందం ఉండాలి?

**వివరణ :** ప్రతి బృందానికి, సమాజానికీ ఏదో ఒకరూపంలో నాయకత్వం అవసరం. నాయకత్వం లేని సమాజం తన అవసరాలకు తగిన లక్ష్యాలను నిర్దేశించుకోలేదు. లక్ష్యాలను సాధించుకోవడానికి తగిన మార్గాలను, సాధనాలను అన్వేషించుకోలేదు. ఒక సమూహాన్ని, సమాజాన్ని ముందుకు నడిపించే నాయకత్వం లేకపోతే పురోగమనం ఉండదు. సమాజం మార్పు సాధించలేక కొట్టుమిట్టాడుతుంది.

**1. సహజనాయకత్వం :** ఒక పక్షుల గుంపును ముందుండి నడిపే పక్షి ఉంటుంది. ఒక ఆవుల మందను ముందుండి నడిపే ఆవు ఉంటుంది. అలాగే మన చుట్టూ ఉన్న కుటుంబాలను చూడండి. అందులో ఒక కుటుంబంలో భర్త లేదా భార్య, మరికొన్ని కుటుంబాలలో తల్లి లేదా కొడుకు లేదా కూతురు ఆ కుటుంబానికి నాయకత్వాన్ని అందిస్తారు. ఆకుటుంబంలో అందరి సమస్యల్ని తమ సమస్యలుగా భుజాన వేసుకుంటారు. ఇష్టపూర్వకంగా సేవలు అందిస్తారు. పక్షుల గుంపులకు, పశువుల మందలకు, మానవ కుటుంబాలకు ఎన్నికలు ఉండవు. పదవులూ ఉండవు. అయినా అవి నాయకత్వాన్ని అందిస్తాయి. ఇదీ సహజనాయకత్వం. దీన్ని మనం అంది పుచ్చుకోవాలి. పదవులు, హోదాలతో నిమిత్తం లేకుండా సమాజహితం కోసం నాయకత్వాన్ని అందించే పవిత్ర కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి.

**2. బృందనాయకత్వం:** లోక్‌సత్తా పార్టీలో నాయకులు, అనుచరులు ఉండరు. అందరూ సహచరులే. బృందనాయత్వానికి అత్యంత కీలకమైంది కలిసి పనిచేసేతత్వం. ఈ జట్టు తత్వాన్ని మనం ప్రయత్న పూర్వకంగా పెంపొందించుకోవాలి. ఎందుకంటే మన దేశంలో కలిసి పనిచేసే తత్వం తక్కువ. ఇద్దరు వ్యక్తులు ఉంటే మూడు పార్టీలు పెట్టే మనస్తత్వం ఎక్కువ.

- మనుషులన్న తర్వాత భిన్నాభిప్రాయాలుంటాయి. ఎవరి ప్రత్యేకతలు వారికుంటాయి. ఈ భిన్నత్వంలో ఏకత్వమే బృంద నాయకత్వం. ఈ ఏకత్వాన్ని సాధించడానికి భిన్నత్వాన్ని తుంచేయకూడదు. భిన్నత్వాన్ని కాపాడే పేరుతో ఏకత్వాన్ని వదులుకోకూడదు.
- బృందం కలిసి పని చేయాలంటే విభేదించే అంశాలతో ప్రారంభించకూడదు. ఆమోదించే అంశాలతో జట్టునడక ప్రారంభించాలి. కలిసి పనిచేసే కొద్దీ, జట్టు అనుభవాన్ని సంపాదించే కొద్దీ ఐక్యత బలపడుతుంది. విభేదాలనే ప్రధానం చేసుకుంటే ఒక్క అడుగు ముందుకుపడదు. జట్టు ముక్కలవుతుంది.

F బృందంలోని సభ్యులందరికీ ఒకే రకమైన శక్తి సామర్థ్యాలు ఉండవు. బృందం తన సహచరులలో ఉన్న బలాన్ని, నైపుణ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. ఎదుటివారి బలాన్ని గుర్తించడం, గౌరవించడం, పరస్పర విశ్వాసంతో పనిచేయడం బృందనాయకత్వాలు అలవర్చుకోవాలి.

F లక్ష్యం ప్రధానం అయితే పదవులు, ప్రాధాన్యతలు, గుర్తింపులు ఇతర చిల్లర విభేదాలు తెరమరుగవుతాయి. ఎవరు ఎక్కడ ఉన్నారన్నది అప్రధానం అవుతుంది. ఒక విజయాన్ని సాధిస్తే అది జట్టు విజయం అవుతుంది. ఉదాహరణకి కృష్ణాష్టమికి గ్రామాలలో యువకుల బృందాలు ఉట్టికొట్టే వేడుక చేస్తారు. ప్రతి బృందం ఉట్టి కొట్టడమే లక్ష్యంగా పనిచేస్తుంది. జట్టుసభ్యులలో బలంగా బరువు మోయగలవారు కింది వరుసలో ఉంటారు. వారిమీద కాస్త బరువు తక్కువ వారు, ఆపైన ఇంకాబరువు తక్కువ వారు చివరికి ఒక చిన్న కుర్రవాణ్ణి పెట్టుకుని ఉట్టి కొట్టడానికి ప్రయత్నిస్తారు. జట్టుకు ఒక నాయకుడు ఉంటాడు. అతను బాగా బరువుమోయగల వాడైతే కింద వరుసలో ఉంటాడు; జట్టుకు ఎక్కడ అవసరమో అక్కడ ఉంటాడు. ఎవరు ఎక్కడ ఉండాలన్నది జట్టుసభ్యుల శక్తి సామర్థ్యాలను బట్టి నిర్ణయం అవుతుంది. పదవుల్ని బట్టి నిర్ణయం కాదు. అక్కడ అందరి లక్ష్యం ఉట్టికొట్టడమే. జట్టులో సభ్యులు ఎవరు ఎక్కడ ఉన్నారన్నది ముఖ్యం కాదు. లోక్‌సత్తా పార్టీకి ఇలాంటి జట్టు తత్వం ఉండాలి. లక్ష్యమే ప్రధానంగా ఉండే జట్టుతత్వాన్ని మనం జీర్ణించుకోవాలి.

F ఉద్యమ సంస్థలో నాయకత్వ బృందాలు మార్గదర్శక పాత్ర వహించాలి. పెత్తనం చేయకూడదు. కార్యకర్తలను ప్రోత్సహించడం, ఉత్సాహపర్చడం, స్నేహభావం ప్రదర్శించడం ద్వారా ఎంత పనినైనా చేయించగలుగుతారు.

F అందరికి ఒక నోరు రెండు చెవులు ఉన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే మనం ఎదుటవారికి చెప్పేదానికన్నా రెట్టింపు సమయం కార్యకర్తల నుండి, ప్రజల నుండి వినడానికి, తెలుసుకోవడానికి పూనుకోవాలి. అప్పుడే అందరి విశ్వాసాన్ని చూరగొనే నాయకత్వం అందించగలుగుతారు.

F నాయకత్వ బృందాలు సంస్థ ప్రయోజనాల పట్ల దృఢంగా వ్యవహరించాలి. సంస్థను స్వప్రయోజనాలకు వాడుకునే వారి పట్ల, సంస్థ ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి.

F బృందనాయకత్వం ఒక కళ. దానిని ప్రయత్నపూర్వకంగా సంతరించుకోవాలి. అన్నిస్థాయిల్లోనూ మనం బృందనాయకత్వాన్ని అందించాలి. కొత్త రాజకీయ సంస్కృతిని అలవర్చుకోవాలి, ఆచరించాలి.

# 5. లోక్‌సత్తా పార్టీ ఉద్యమ రూపాలు, కార్యకలాపాలు

## ప్రశ్న : లోక్‌సత్తా పార్టీ ఎలాంటి ఉద్యమ రూపాలను చేపడుతుంది?

**వివరణ:** మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. పార్టీలను, సంస్థలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ అందరికీ ఉంది. ప్రజల్ని చైతన్య పర్చడానికి, సమీకరించడానికి, సంఘటిత పర్చడానికి అవకాశాలున్నాయి. ఎన్నిలోటు పాట్లు ఉన్నా ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలని మార్చడం ప్రజల చేతుల్లో ఉంది. ప్రజలు ప్రభుత్వాలని మారుస్తున్నారు.

రాజకీయం అంటే ప్రజల ఉమ్మడి అవసరాలను తీర్చడం. వారి సమస్యలకి నిజమైన పరిష్కారాలను అన్వేషించడం, వారిజీవితాలను సుఖప్రదం చేయడానికి కొత్తదారులు వెతకడం రాజకీయాలలో సంఘర్షణ ఉంటుంది. అది పార్టీల మధ్య సంఘర్షణ కాదు. వ్యక్తుల మధ్య సంఘర్షణ కాదు. భావాల మధ్య సంఘర్షణ, విధానాల మధ్య సంఘర్షణ మాత్రమే. అందుకోసం ప్రజల మధ్య బహిరంగ చర్చను అర్థవతంగా నిర్వహించాలి. ఈ చర్చలో ప్రజల్ని భాగస్వాములను చేయాలి. ఇదీ నిజమైన రాజకీయం. అంతేగాని పార్టీల మధ్య కక్షలు పెంచడం, ప్రజల్ని చీల్చి ముఠా కక్షలలో పావుల్ని చేయడం రాజకీయం కాదు.

అలాగే పార్టీలకు సభలు, సమావేశాలు నిర్వహించుకునే స్వేచ్ఛ ఉంటుంది. నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉంటుంది. అయితే అవి ఇతరుల స్వేచ్ఛకి భంగం కలిగించేవిగా ఉండకూడదు.

ఎ) లోక్‌సత్తా పార్టీ శాంతియుతమైన, అహింసాయుతమైన కార్యకలాపాలను మాత్రమే చేపడుతుంది.

బి) ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించే రాస్తారోకోలు, బంద్‌లు వగైరాలకు దూరంగా ఉంటుంది.

సి) బస్సుల దహనం, ఆస్తుల విధ్వంసం లాంటి కార్యకలాపాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్గొనదు.

డి) శాంతియుతమైన ప్రదర్శనలు, ధర్నాలు, నిరాహారదీక్షలు, నల్లబ్యాడ్జీల మౌన ప్రదర్శనలు వంటి కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ప్రజాభిప్రాయసేకరణకు కొత్తతరహా నిరసన పద్ధతులను చేపడుతుంది. ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించని రీతిలో వీటిని నిర్వహిస్తుంది.

లోక్‌సత్తా పార్టీ కార్యకలాపాలలో ఇలాంటి నిరసనలు, ప్రజాసమీకరణలు ఒక భాగం మాత్రమే. ప్రజలలో రాజకీయ చర్చను విస్తృతంగా సాగించడానికి, ప్రజాభిప్రాయసేకరణ చేయడానికి,

ప్రజలకు అందాల్సిన సేవల్ని మెరుగు పర్చడానికి పలు వినూత్నమైన పద్ధతుల్ని, ప్రచార ఆందోళనారూపాల్ని చేపడుతుంది.

**చెయ్యకూడని పనులు :**

- పత్రికలు, ప్రసార మాధ్యమాలకు వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టకూడదు.
- వ్యక్తులను, పార్టీలను దూషించకూడదు. ప్రజాప్రతినిధులతో, అధికారులతో దురుసుగా వ్యవహరించకూడదు.
- ప్రభుత్వ ఆస్తులను ఎట్టిపరిస్థితులలోనూ ధ్వంసం చెయ్యకూడదు. పౌరజీవనాన్ని స్తంభించే కార్యక్రమాలను చేపట్టకూడదు.
- కులాలు, మతాల మధ్య సంఘర్షణపెంచే కార్యక్రమాలు చేపట్టకూడదు.
- ప్రభుత్వ కార్యాలయాలలో, పోలీస్ స్టేషన్‌లలో పైరవీలు చేయకూడదు.
- వ్యక్తిగత ప్రయోజనాలకు పార్టీపేరుని, హోదాని వినియోగించకూడదు.

## ప్రశ్న: ప్రాథమిక శాఖల విధులు, కార్యకలాపాలు ఎలా వుంటాయి?

**వివరణ :** లోక్‌సత్తా పార్టీకి ప్రాథమిక శాఖలు చాలా ముఖ్యమైనవి. ఈ శాఖలు పార్టీకీ ప్రజలకీ మధ్య లింకుగా వుంటాయి. పార్టీని ప్రజలకు పరిచయం చేసేవి, ప్రజల్ని పార్టీ కార్యకలాపాలలోకి ఆకర్షించేవి ఈ ప్రాథమిక శాఖలే. ఈ లింకు సరిగా పనిచెయ్యకపోతే పార్టీ విధానాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరవు. ప్రజలలో వున్న స్పందనని పార్టీ విస్తరణకు సద్వినియోగం చేసుకునే పరిస్థితి వుండదు.

అందుచేత ప్రాథమిక శాఖలలో పనిచేసే నాయకత్వ బృందాలు, కార్యకర్తలు, వలంటీర్లు పూర్తిగా తర్ఫీదు పొందిన వారై వుండాలి. మనం ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి అన్న స్పష్టత కలవారై వుండాలి. ప్రజాసంబంధాలను పెంచుకునే నేర్పరితనం, సమస్యలకు పరిష్కారాలను ఆలోచించగల నిపుణతను, సాధించగల మార్గాలు తెలిసిన వారై వుండాలి. అందుచేత ఈ శాఖల ప్రాధాన్యతని అన్ని స్థాయిలలోని నాయకత్వ బృందాలు గుర్తించాలి.

**పార్టీ ప్రాథమిక శాఖలు ఈ క్రింది కార్యకలాపాలను నిర్వహించాలి:**

1. **ప్రచార కార్యక్రమాలు:** నూతన రాజకీయ సంస్కృతి గురించి, పార్టీ ఎజెండాలోని అంశాల మీద ఆ ప్రాంత ప్రజలలో విస్తృతంగా ప్రచారం చెయ్యాలి. కరపత్రాల పంపిణీ, ఆడియో, వీడియో క్యాసెట్ల ప్రచారం చెయ్యాలి. వివిధ తరగతుల ప్రజలకు ఆసక్తి కలిగించే ఎజెండా అంశాలపై సభలు, సమావేశాలు, చర్చాగోష్టులు నిర్వహించాలి. విద్యార్థులను యువకులను, మహిళలను సమీకరించే ప్రత్యేక కార్యకలాపాలు నిర్వహించాలి.

2. **మౌలిక వసతుల కోసం :** నివాసయోగ్యమైన గ్రామాలు, పట్టణాలు, కాలనీలు, పేదల వాడల కోసం, కార్యక్రమాలు చేపట్టాలి. మౌలిక వసతులైన మంచినీరు, మురుగుదొడ్లు, డ్రయినేజీ, వీధిదీపాలు, ఇతర స్థానిక ప్రజల అవసరాలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి "సూక్ష్మ ప్రణాళికలు" రూపొందించాలి. ఈ సమస్యల పరిష్కారానికి వివిధ ప్రజా ఒత్తిడి కార్యక్రమాలు చేపట్టాలి.

3. **ప్రజల స్థితిగతుల్ని మెరుగుపరిచే కార్యకలాపాలు :** నిరుద్యోగ యువతపై సర్వే, ఉపాధి నైపుణ్యాల పొందే అవకాశాలపై అవగాహన కల్పించడం. రైతులకు వ్యవసాయాన్ని లాభసాటి చెయ్యడానికి తీసుకోవలసిన చర్యలు, డ్వాక్రా మహిళలకు నైపుణ్యాల కల్పనా కార్యకలాపాలు, పేదల స్థితిగతులు మార్చే అంశాలు వగైరాలు. వీటిపై నిర్ధిష్టమైన సర్వేలను నిర్వహించడం – అవగాహన కల్పించడం పరిష్కారాలకు ప్రయత్నించడం.

4. **ప్రభుత్వ సేవల మెరుగు కోసం :** మున్సిపల్ పట్టణాల వార్డులలో, డివిజన్‌లలో, గ్రామాలలో ప్రభుత్వసేవలను అందించే పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు, అంగన్‌వాడీలు, రేషన్‌షాపులు వగైరాలపై "వాస్తవ స్థితినివేదికలు" తయారుచెయ్యడం. సమస్యల్ని గుర్తించడం, లబ్ధిదారులను సమీకరించడం, నిబంధనల మేరకు సంస్థల పనితీరు మెరుగు పరిచే కార్యకలాపాలు చేపట్టాలి.

5. **అర్హులకు ప్రభుత్వ పథకాలు :** మున్సిపల్ వార్డులలో/డివిజన్‌లలో, గ్రామాలలో అమలు జరిగే వివిధ ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడం, లబ్ధిదారుల జాబితాలను ప్రకటించడం అర్హులకు, అవినీతి లేకుండా పథకాల అమలుకు కృషి చెయ్యడం.

6. **వ్యక్తిగత సమస్యలు :** పార్టీ శాఖల ముందుకు చాలా వ్యక్తిగత సమస్యలు వస్తాయి. మన ప్రాధాన్యత మాత్రం సామూహిక సమస్యలకే ఇవ్వాలి. అయితే వ్యక్తిగత సమస్యల మీద వచ్చేవారికి తగిన సహకారం ఇవ్వాలి.

   - ప్రజలు హక్కుగా పొందే అంశాలను అంటే జనన, మరణ సర్టిఫికేట్లు కులధృవీకరణ సర్టిఫికేట్లు, అదాయ ధృవీకరణ పత్రాలు వంటి సమస్యలు ఎవరైన తీసుకువస్తే వాటిని పట్టించుకోవాలి. సిటిజన్‌ఛార్టర్లను వినియోగించుకోవాలి.
   - ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తున్నది. గృహాలు, రుణాలు, యువశక్తి, మహిళా సంక్షేమ పథకాలు వగైరాలు వుంటాయి.

     లబ్ధిదారులు తమకు న్యాయం జరగలేదని వస్తుంటారు. ఇలాంటి సందర్భాలలో సమాచారహక్కు చట్టాన్ని వినియోగించుకుని లబ్ధిదారుల జాబితాలను సేకరించాలి. అర్హులకు పద్ధతి ప్రకారం, అవినీతి లేకుండా ఇచ్చే ఏర్పాటుకు ప్రయత్నించాలి.
   - పూర్తిగా వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సహాయం చెయ్యమని వచ్చే వారుంటారు. అలాంటి వారికి పరిష్కారానికి తగిన సలహాలు చెప్పి పంపించాలి.

- మరికొందరు తమ లబ్ధికోసం సిఫారసులు చెయ్యమని కోరతారు. వారికి అలాంటి సహాయం చెయ్యలేమని స్పష్టంగా చెప్పండి. పైరవీ కార్యకలాపాలకు దూరంగా వుండండి.

7. **సిటిజన్స్ ఛార్టర్లు, సమాచార హక్కు :** మున్సిపాలిటీలు, పంచాయితీలు వివిధ ప్రభుత్వకార్యాలయాలలో ప్రజలకు సేవలు అందించే సిటిజన్స్ ఛార్టర్లు, సమాచారాన్ని పొందే హక్కును వినియోగించుకోడానికి సహాయం చెయ్యండి. వ్యక్తిగత కక్షల కోసం ఈ హక్కుల్ని దుర్వినియోగం చెయ్యకూడదు.

8. **పార్టీ కార్యకలాపాలు :** పార్టీ సభ్యులను పెద్దసంఖ్యలో నమోదు చేసుకునే కార్యక్రమాన్ని పార్టీ శాఖలు చేపట్టాలి. చేరిన సభ్యులందరికి కనీసం ఒకరోజు పార్టీ శిక్షణ ఇవ్వాలి. పార్టీ సభ్యులను వారి ఆసక్తిని బట్టి వివిధ కార్యక్రమాల కోసం వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి. యువసత్తా, మహిళాసత్తా, వృత్తి నిపుణుల యూనిట్లు ఏర్పాటు చెయ్యాలి.

9. **ఎన్నికలు కార్యక్రమాలు :** వలంటీర్ల బృందాలతో వార్డు / డివిజన్/ గ్రామస్థాయిలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలను తనిఖీ చేయించాలి. అర్హులైన వారిని ఓటర్లుగా చేర్పించాలి. విధిగా ఓటు చేసేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.

   - పట్టణాలు, నగరాలలో పోలింగ్ స్టేషన్ పరిధిలో ఏరియా ప్రజాసభకు ఎన్నికలు నిర్వహించాలి. వార్డు ప్రజా కమిటీలను ఏర్పాటు చేయాలి.
   - అన్ని సాధారణ ఎన్నికలలో పట్టణ వార్డు/డివిజన్ గ్రామశాఖలు అభ్యర్థుల నిర్ణయానికి జరిగే "ప్రాథమిక ప్రజా ఎన్నిక"కు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో తగిన ఏర్పాట్లు చెయ్యాలి.
   - ఎన్నికలలో తమ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రచారానికి, ఏజెంట్ల నియామకానికి, తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

ఈ ఎన్నికల ప్రచారం, ప్రాథమిక ఎన్నికల నిర్వహణకు, ఎన్నికలలో పాల్గొనడానికి వీలుగా వార్డు/డివిజన్/గ్రామ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు పార్టీ సభ్యులతో పోలింగ్ స్టేషన్ బృందాలను ఏర్పాటు చెయ్యాలి.

ఇలా పార్టీని విస్తృత పరచడానికి, ఎన్నికలలో పాల్గొనడానికి తమ పరిధిలో తగిన అన్ని ఏర్పాట్లకు ప్రాథమిక శాఖలు బాధ్యత తీసుకోవాలి.

## ప్రశ్న: సూక్ష్మప్రణాళికలు, వాస్తవ స్థితినివేదికలు ఎలా తయారు చేసుకోవాలి?

**వివరణ:** స్థానికంగా ప్రజల సమస్యల్ని గుర్తించడానికి, వాటిని పరిష్కరించడానికి మనకి కొన్ని

సాధనాలు, పద్ధతులు వుండాలి. ఏ పని చేపట్టినా అది ప్రజల భాగస్వామ్యంతో వారి ప్రాధాన్యతలతో, ఆచరణ యోగ్యమైన పరిష్కారాలతో జరగాలి.

ఉదాహరణకి నివాసయోగ్యమైన గ్రామం లేదా పట్టణం కోసం మీరు కార్యక్రమాల్ని తీసుకుంటే దానికి సంబంధించిన పలు సమస్యల మీద సర్వేలు నిర్వహించాలి. దానివల్ల ప్రయోజనం పొందే వారి భాగస్వామ్యంతో వీటిని నిర్వహించాలి. మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, రోడ్లు, లైట్లు, రక్షిత మంచినీరు ఇతర మౌలిక వసతుల మీద చేసిన సర్వే ఆధారంగా మున్సిపల్ వార్డులు/ గ్రామంలో ఏ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నయో గుర్తించాలి. ఈ సమస్యలను ప్రజల ముందు లేదా ఆసక్తిగల బృందం ముందు పెట్టి ప్రాధాన్యతలు నిర్ణయించాలి. ప్రజల భాగస్వామ్యంతో, ప్రాధాన్యతా క్రమంతో స్థానిక సమస్యలు, పరిష్కారాల నివేదికను "సూక్ష్మ ప్రణాళికగా" ప్రకటించాలి.

స్థానికంగా ప్రజలకు సేవలందించే సంస్థలలో సమస్యల్ని గుర్తించడానికి "వాస్తవ స్థితి నివేదిక" అనువుగా వుంటుంది. ఉదాహరణకి ఒక రేషన్ షాపు వుంటే దాని నియమనిబంధనలు సేకరించాలి. వాటిని ఒక పట్టికగా రూపొందించాలి. మీ గ్రామంలో/మున్సిపల్ వార్డులో వున్న రేషన్ షాపు ఆ నియమనిబంధనలను పాటిస్తున్నదీ లేనిదీ లబ్ధిదారులను సమావేశపర్చి చర్చించాలి. నియమనిబంధనలు పాటించని అంశాలను గుర్తించాలి. వాటి అమలుకు లబ్ధిదారులతో కలిసి ప్రయత్నించాలి. ఈ పద్ధతిని అన్ని ప్రభుత్వ సంస్థలలో సేవల మెరుగుదలకు వినియోగించుకోవచ్చును.

ఈ సూక్ష్మ ప్రణాళికలు, వాస్తవస్థితి నివేదికలు ప్రజల భాగస్వామ్యంతో కలిసి చేసినందువల్ల వాటి పరిష్కారంలో ప్రజలు పాలు పంచుకోడానికి ఆసక్తి చూపిస్తారు. ఆ సమస్యల గుర్తింపు వాస్తవాల ఆధారంగా, సర్వేల ఆధారంగా జరిగినందువల్ల నియమనిబంధనల పరిధిలో ఉన్నందు వల్ల వాటిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించక తప్పనిస్థితి ఏర్పడుతుంది. ఆ కార్యక్రమం విజయవంతం అవుతుంది. ఈ సమస్యల పరిష్కారానికి సిటిజన్స్ ఛార్టర్లు, సమాచార హక్కు మంచి సాధనాలుగా ఉపయోగపడతాయి.

## ప్రశ్న: స్థానిక వలంటీర్లు ఎలాంటి బాధ్యతలు నిర్వహించాలి?

**వివరణ:** లోక్‌సత్తా పార్టీ కార్యకలాపాలలో స్థానిక వలంటీర్లు కీలకమైన పాత్ర పోషిస్తారు. తమ పనులు తాము చేసుకుంటూ తమకున్న సమయాన్ని సమాజహితం కోసం వినియోగించాలనుకునే వారంతా లోక్‌సత్తా పార్టీ స్థానిక వలంటీర్లుగా సేవలు అందించవచ్చును. మున్సిపల్‌వార్డు/ డివిజన్, గ్రామ పంచాయితీలోని పార్టీశాఖలు తమ సభ్యులను, క్రియాశీల సభ్యులను వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి.

- వలంటీర్లు విధిగా ఒకరోజు రాజకీయ శిక్షణ పొందాలి. ఏవైనా ప్రత్యేక కార్యకలాపాలు వచ్చినపుడు ఆ కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి ఒక రోజు లేదా ఒకపూట

శిక్షణ తీసుకోవాలి. స్థానిక వలంటీర్లు ఈ కింది అంశాలలో సేవలు అందించడానికి సంసిద్ధులు కావాలి.

**1. స్థానిక స్థాయిలో సర్వేలు :**

- ఓటర్ల జాబితాలను సరిచూసి అర్హులైన వారిని ఓటర్లుగా చేర్పించడానికి ఇంటింటి సర్వే
- గ్రామంలో నిరుద్యోగ యువత, చదువు, నైపుణ్యాల అవసరాలపై సర్వే.
- వ్యవసాయం, గ్రామీణ పేదలు, పట్టణంలో కాలనీవాసులు, పేదల వాడలలో సమస్యలపై సూక్ష్మ ప్రణాళికల కోసం సర్వేలు
- పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, రేషన్ షాపులు వగైరాల పై వాస్తవ స్థితి నివేదికల తయారీకి సర్వేలు.
- పంచాయితీ, మున్సిపాలిటీ తదితర ప్రభుత్వ శాఖల సేవల పైన సర్వేలు

**2. స్థానిక సహాయ కార్యక్రమాలు :**

- పాఠశాల పిల్లలకు కొంతకాలం పాటు రోజూ ఒక గంట పాఠాలు చెప్పడానికి, నిరక్షరాస్యుల బృందాలను అక్షరాస్యుల్ని చెయ్యడానికి వలంటీర్లుగా పనిచేయడం
- వైద్య శిబిరాలు, శ్రమదానాలలో పాల్గొనడం
- ప్రమాదాలు, ప్రకృతివైపరిత్యాలలో బాధితులకు సహాయం అందించడం

**3. ఎన్నికల ప్రచారం, కార్యక్రమాలు :**

- ఎన్నికలలో గ్రామం/వార్డు/డివిజన్ ప్రచార బృందంలో పని చెయ్యడం. ఆఫీస్ నిర్వహణకు తోడ్పాడునివ్వడం
- అభ్యర్ధుల నిర్ణయం కోసం జరిపే " ప్రాథమిక ప్రజాఎన్నిక" వలంటీరుగా పనిచెయ్యడం
- పట్టణాలలో వార్డు/ డివిజన్ లేదా పోలింగ్ స్టేషన్ ఏరియా ప్రజాసభల ఎన్నికల నిర్వహణ బృందంలో వలంటీరుగా పనిచెయ్యడం
- ఎన్నిక జరిగే రోజున పోలింగ్ ఏజంట్లుగా, ప్రచారకులుగా పనిచెయ్యడం.

ఇవీ స్థూలంగా వలంటీర్లు నిర్వహించాల్సిన కొన్ని బాధ్యతలు, కార్యక్రమాలు. పార్టీ ఏదైనా ఒక కార్యక్రమం తలపెట్టినప్పుడు ఆ కార్యక్రమంలో నిర్దిష్టంగా కొద్దిరోజుల పాటు లేదా కొంత సమయం తప్పనిసరిగా కేటాయించాలి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు వలంటీర్ల కృషి మీదే ఆధారపడి ఫలితాలను ఇస్తాయి. ఇలాంటి వలంటీర్లు లేకుండా, వారి తోడ్పాటు లేకుండా పార్టీ కార్యక్రమాలు విస్తరించవు. అందుచేత వలంటీర్ల జాబితాలు, చిరునామాలు, ఆసక్తి గల అంశాలు, టెలిఫోను నెంబర్లు పార్టీశాఖలు విధిగా సేకరించి పెట్టుకోవాలి. వలంటీర్ల సేవలకు తగిన గౌరవాన్ని, గుర్తింపునీ ఇవ్వాలి.

# లోక్‌సత్తా పార్టీ గురించి....

F సమాజహితం కోసం ధనరాజకీయాన్ని జనరాజకీయంగా మార్చడానికి వచ్చిన తొలిపార్టీ లోక్‌సత్తా పార్టీ

F ప్రజలు ప్రభువులు, పాలకులు సేవకులేనని పకటించిన తొలిరాజకీయ పార్టీ లోక్‌సత్తా పార్టీ

F ప్రతి జిల్లాకి ఒక ప్రభుత్వం ఉండాలని పంచాయితీలను, మున్సిపాలిటీల ను స్థానిక ప్రభుత్వాలుగా ప్రకటించిన తొలిరాజకీయ పార్టీ లోక్‌సత్తా పార్టీ

F సామాజిక హోదాని మార్చడమే సామాజికన్యాయానికి మార్గంగా, కులవివక్ష, లింగవివక్ష, ఆర్థికఅంతరాల వివక్షలపై యుద్ధం ప్రకటించిన తొలిపార్టీ లోక్‌సత్తా పార్టీ

F మానవాభివృద్ధిని సాధించడమే రాజకీయానికి కీలకమైన లక్ష్యం కావాలని ప్రకటించిన తొలిపార్టీ లోక్‌సత్తా పార్టీ. పుట్టిన ప్రతిబిడ్డకీ కులంతో, డబ్బుతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల విద్య, వైద్యం, ఉపాధి నైపుణ్యాలు అందించడమే ధ్యేయంగా చేసుకుంది

F ప్రజల స్థితిగతుల్ని మార్చడానికి రైతులకు లాభసాటి వ్యవసాయానికి, గ్రామీణ పేదలకు, చేతివృత్తుల వారికి, పట్టణాలలోని అసంఘటిత కార్మికులకు జీవన భద్రత కల్పించే నిర్దిష్ట ప్రణాళికగల పార్టీ లోక్‌సత్తా పార్టీ

F రాజకీయంలో, పరిపాలనలో అవినీతిని తొలగించడానికి, పారదర్శకమైన జవాబుదారీతనంగల సుపరిపాలన అందించడానికి, నేరపరిశోధనలో రాజకీయ జోక్యాన్ని అంతం చెయ్యడానికి, స్థానిక కోర్టుల ద్వారా సత్వరన్యాయం అందించడానికి కంకణం కట్టుకున్న పార్టీ లోక్‌సత్తా పార్టీ

F పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల అథారిటీ, నాయకత్వానికి ప్రత్యక్ష ఎన్నిక, రికాల్ పద్ధతిగల తొలిపార్టీ లోక్‌సత్తా పార్టీ

F పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల తుది నిర్ణయాధికారాన్ని “ప్రాథమిక ప్రజా ఎన్నిక” పద్ధతి ద్వారా ప్రజలకే కట్టబెట్టిన ఏకైక పార్టీ లోక్‌సత్తా పార్టీ